
సాక్షి భద్రాద్రి కొత్తగూడెం

గురువారం। 2। మే। 2024



నీటి తడులు ముఖ్యం

ఎండలు మండుతున్నందున పామాయిల్ మొక్కలకు సరిపడా నీరందకపోతే దిగుబడి తగ్గుతుందని అధికారులు అంటున్నారు. IIలో



వాడవాడలా మేడే

కార్మిక దినోత్సవమైన మే డే వేడుకలను జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. పలుచోట్ల ఎర్రజెండాలతో ప్రదర్శనలు చేశారు. IIIలో

గరిష్టం / కనిష్టం
42° / 28°

వాతావరణం

జిల్లాలో గురువారం అత్యధిక ఉష్ణోగ్రత నమోదవుతుంది. గంటగంటకూ ఎండ పెరుగుతుంది. రాత్రి వాతావరణం వేడిగానే ఉంటుంది.

న్యూస్‌రీల్

కనులపండువగా రామయ్య నిత్యకల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక బుధవారం కనులపండువగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

13న శ్రీరామ దీక్ష విరమణ..

భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో ఈనెల 13న శ్రీరామ దీక్ష విరమణలు ఉంటాయని ఈఓ ఎల్.రమాదేవి తెలిపారు. ఈ సందర్భంగా 14వ తేదీన రామయ్యకు పట్టాభిషేకం, సాయంత్రం రథోత్సవం నిర్వహిస్తామని పేర్కొన్నారు. కాగా, 13వ తేదీన ఎన్నికలు ఉన్న నేపథ్యంలో 15వ తేదీ వరకు దీక్ష విరమణకు అవకాశం కల్పించినట్లు తెలిపారు.

బాలాజీ ఆలయంలో సుదర్శన హోమం



సుదర్శన హోమం జరిపిస్తున్న అర్చకుడు

అన్నపురెడ్డిపల్లి : మండల కేంద్రంలో కొలువుదీరిన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీబాలాజీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో వైభవంగా సుదర్శన హోమం నిర్వహించారు. బుధవారం శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకుని స్వామివారికి సుప్రభాత సేవ, అర్చన తదితర పూజా కార్యక్రమాలు చేశారు. అనంతరం అర్చకులు గిరిధరాచార్యులు, ప్రసాదాచార్యులు ఆధ్వర్యంలో సుదర్శన హోమం జరిపించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనగా, హోమం అనంతరం స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలి



ఈవీఎం పనితీరుపై అవగాహన కల్పిస్తున్న పీఓ

మణుగూరు రూరల్ : పార్లమెంట్ ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలని భద్రాచలం ఐటీడీఏ పీఓ, పినపాక నియోజకవర్గ అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి ప్రతీక్‌జైన్ సూచించారు. మణుగూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈవీఎం యంత్రాల ర్యాండమైజేషన్‌పై పీఓలు, ఏపీఓలకు బుధవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలింగ్ ప్రక్రియపై అవగాహన కల్పించేందుకు ఇస్తున్న శిక్షణను సిబ్బంది సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈవీఎంల పనితీరు, ఎన్నికల ప్రొఫార్మాలను పూర్తి చేయడంపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఎన్నికల సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటుహక్కు వినియోగించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో సహాయ ఓటరు నమోదు అధికారి రాఘవరెడ్డి, ఎన్నికల డీటీలు, సిబ్బంది పాల్గొన్నారు.

మన వంతెన భద్రమేనా?

వేసవిలో వీస్తున్న వడగాడ్పులు, గాలి దుమారాలకు రాష్ట్ర వ్యాప్తంగా నిర్మాణంలో ఉన్న అనేక వంతెనలు పేక మేడల్లా కూలిపోతున్నాయి. పనులు చేపట్టడంలో సదరు కాంట్రాక్టర్లు పాటిస్తున్న నాణ్యత ప్రమాణాలను ప్రశ్నిస్తున్నాయి. ఈ నేపథ్యంలో కొత్తగూడెం – సుజాతనగర్ మధ్య మూడేళ్లుగా నిర్మాణంలో ఉన్న రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్‌వోబీ) పనుల నాణ్యతపై సందేహాలు వ్యక్తం అవుతున్నాయి.

– సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం

అప్రోచ్ రోడ్ పనులు చేస్తున్న దృశ్యం (ఇన్‌సెట్) సిమెంట్ బిళ్లల పటిష్టానికి అమర్చిన బోల్టులు





కొత్తగూడెం - సుజాతనగర్ మధ్య ఆర్వోబీ

- నిర్మిస్తుండగానే ర్యాంపులో కుంగుబాటు
- తూతూ మంత్రంగానే సర్దుబాటు నిర్మాణాలు
- వంతెన పనుల్లో నాణ్యతపై సందేహాలు

నత్తనడకన పనులు..

కొత్తగూడెం నుంచి ఖమ్మం వెళ్లే ప్రధాన రహదారి క్రాస్ చేస్తూ భద్రాచలం రోడ్ – సత్తుపల్లి రైల్వే లైన్ నిర్మించారు. ఏడాది క్రితం ఈ రైలు మార్గం ప్రారంభమైంది. బొగ్గు రవాణా కూడా జరుగుతోంది. అయితే ఈ ట్రాక్ నిర్మాణంతో పాటే ఖమ్మం – కొత్తగూడెం రహదారిపై సుజాతనగర్ శివారులో భారీ వంతెన నిర్మాణానికి రూ.43 కోట్ల నిధులు మంజూరయ్యాయి. కాంట్రాక్ట్ దక్కించుకున్న సంస్థ మూడేళ్లు దాటినా నేటికీ పనులు పూర్తి చేయలేదు. నత్తకు నడక నేర్పుతున్న చందంగా అత్యంత నెమ్మదిగా పనులు చేపడుతున్నారు. ఇప్పటికే పనుల జాప్యంపై విమర్శలు వస్తుండగా, తాజాగా నాణ్యతపైనా సందేహాలు వ్యక్తం అవుతున్నాయి.

కూలిపోయిన ర్యాంపు..

రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణాలకు సంబంధించి సాధారణంగా వంతెన అప్రోచ్ రోడ్ (ర్యాంపు) నిర్మాణాలు త్వరగా పూర్తవుతాయి. రైల్వే ట్రాక్ మీదుగా హై టెన్షన్ విద్యుత్ తీగలపై నిర్మాణమే ఆలస్యం అవుతుంది. కానీ కొత్తగూడెం – సుజాతనగర్ మధ్య నిర్మించే ఆర్వోబీ విషయంలో పరిస్థితి ఇందుకు విరుద్ధంగా ఉంది. వంతెనలో కీలకమైన ట్రాక్ పైభాగం రెండేళ్ల క్రితమే పూర్తి కాగా, ఇరువైపులా అప్రోచ్‌రోడ్ (ర్యాంప్) పనులే ఆగిపోయాయి. గత వేసవిలో ఈ పనులు ప్రారంభించారు. కాగా ఈ ఏడాది ఫిబ్రవరి చివరి వారంలో కొత్తగూడెం నుంచి ట్రాక్ వరకు నిర్మిస్తున్న ర్యాంపు కూలిపోయింది. నిర్మాణ పనుల్లో నాణ్యతా లోపాలు, డిజైనింగ్‌లో సమస్యల కారణంగా ర్యాంపు కోసం ఏర్పాటు చేసిన ప్రీ కాస్టెడ్ సిమెంటు బిళ్లలు ఊడిపోయాయి. ఈ సమస్యను అధిగమించేందుకు రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ర్యాంపు నిర్మాణంలో కొత్తగా పిల్లర్లు నిర్మిస్తున్నారు.

తనిఖీలు చేపట్టాలని డిమాండ్..

పిల్లర్లు నిర్మిస్తున్నప్పటికీ ర్యాంపు పనుల్లో ఆశించిన పటిష్టత కనిపించడం లేదు. దీంతో సిమెంటు బిళ్లలను పట్టి ఉంచేందుకు వీలుగా బోల్టులు బిగిస్తున్నారు. ఒక చోట సమస్య వచ్చిందని బోల్టులు బిగిస్తే వారం రోజుల వ్యవధిలో మరో చోట సమస్య ఉత్పన్నం అవుతోంది. నిత్యం ఈ మార్గంలో ప్రయాణించే వారు, క్షేత్రస్థాయిలో పరిశీలించిన వారు రోజురోజుకూ పెరుగుతున్న బోల్టుల నిర్మాణాలను చూసి సందేహం వ్యక్తం చేస్తున్నారు. ఈ తరుణంలో ఇటీవలి గాలివానలకు పెద్దపల్లి జిల్లా ముత్తారం, జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్లలో రెండు చోట్ల నిర్మాణంలో ఉన్న వంతెనలు కూలిపోవడం చర్చనీయాంశమైంది. దీంతో కొత్తగూడెం – సుజాతనగర్ వంతెన నిర్మాణం, నాణ్యతపై తనిఖీలు చేపట్టి సందేహాలను నివృత్తి చేయాలని జిల్లా ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

కాంగ్రెస్‌లో జోష్..

- ఖమ్మం అభ్యర్థి రఘురాంరెడ్డి సుడిగాలి పర్యటన
- సన్నాహక సమావేశాలు, ప్రచారంలో పాల్గొంటున్న మంత్రులు
- నిత్యం ప్రజల్లోనే ఉండేలా నేతల ప్రణాళిక
- సీపీఎం, సీపీఐ మద్దతుతో శ్రేణుల్లో ఉత్సాహం
- ఈనెల 4న కొత్తగూడెం రానున్న సీఎం రేవంత్‌రెడ్డి



సాక్షి ప్రతినిధి, ఖమ్మం: అసెంబ్లీ ఎన్నికల విజయం ఇచ్చిన జోష్‌తో ఖమ్మం లోక్‌సభ స్థానంలోనూ గెలుపొందాలనే పట్టుదలతో కాంగ్రెస్ శ్రేణులు కదం తొక్కుతున్నాయి. నామినేషన్ల ఘట్టం ముగిసిన అనంతరం పార్టీ అభ్యర్థితోపాటు మంత్రులు, ప్రజాప్రతినిధులు నియోజకవర్గాల బాట పట్టారు. కాంగ్రెస్ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి వివిధ వర్గాలను కలుస్తూ తనను గెలిపించాలని అభ్యర్థిస్తున్నారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు సమన్వయంతో పనిచేస్తూ కార్యకర్తలతో సన్నాహక సమావేశాలు ఏర్పాటు చేస్తూ దిశానిర్దేశం చేస్తున్నారు. మరోవైపు ఈనెల 4న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కొత్తగూడెంలో ఏర్పాటుచేసే ప్రచార సభకు హాజరు కానున్నారు. ప్రచారానికి మరో పది రోజుల గడువే ఉండడంతో ఈ సమయాన్ని సద్వినియోగం చేసుకునేలా పార్టీ కేడర్ ముందుకెళ్తోంది.

అభ్యర్థి ప్రకటన జాప్యమైనా..

ఖమ్మం లోక్‌సభ స్థానానికి బీఆర్‌ఎస్, బీజేపీ అభ్యర్థులను ముందుగానే ప్రకటించడంతో ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే సమయానికే వారు ఓ దఫా ప్రచారం పూర్తి చేశారు. అయితే కాంగ్రెస్ అభ్యర్థి ప్రకటన ఆలస్యమవుతూ వచ్చింది. రాజకీయ సమీకరణలు, ఆశావహులు ఎక్కువ మంది ఉండడం, అభిప్రాయాల సేకరణ, టికెట్ దక్కని నేతలను బుజ్జగించడం తదితర కారణాలతో నామినేషన్ గడువు ముగిసే ముందురోజు అభ్యర్థిగా రఘురాంరెడ్డిని ప్రకటించారు. ఈ మేరకు రఘురాంరెడ్డిని నామినేషన్ ర్యాలీకి మంత్రులు పొంగులేటి, తుమ్మలతో పాటు ఎంపీ రేణుకా చౌదరి హాజరై కార్యకర్తలను ఉత్సాహపరిచారు. అనంతరం ప్రచార రంగంలోకి దిగారు.

ఉత్సాహంగా ప్రచారం



కాంగ్రెస్ అభ్యర్థిగా రఘురాంరెడ్డి నామినేషన్ వేసిన రోజు రాత్రే ప్రచారం ఆరంభించారు. అప్పటి నుంచి సుడిగాలి పర్యటనలు చేస్తూ పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలను చుట్టేస్తున్నారు. వివిధ కార్యక్రమాలకు హాజరవుతూ నాయకులు, కార్యకర్తలనే కాక ఓటర్లను సైతం నేరుగా కలిసి తనను గెలిపించాలని కోరుతున్నారు. పాలేరు నియోజకవర్గంలో బుధవారం నిర్వహించిన ప్రచారంతో పాటు మే డే వేడుకలకు హాజరయ్యారు. ఇక 4వ తేదీన కొత్తగూడెంలో ఏర్పాటుచేసిన బహిరంగ సభకు సీఎం రేవంత్‌రెడ్డి హాజరు కానుండడంతో ప్రచారం మరింత ఊపందుకుంటుందని పార్టీ శ్రేణులు భావిస్తున్నాయి. అలాగే, ఇంకొందరు అగ్రనేతలు సైతం వచ్చే అవకాశముందని తెలుస్తోంది.

కలివిడిగా.. విడివిడిగా..

అభ్యర్థి రఘురాంరెడ్డి తరఫున డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, ఎంపీ రేణుకాచౌదరి ప్రచారంలో పాల్గొంటున్నారు. నియోజకవర్గాల వారీగా ముఖ్య కార్యకర్తలతో సన్నాహక సమావేశాలు నిర్వహిస్తూ దిశానిర్దేశం చేస్తున్నారు. ఖమ్మం, పాలేరు, మధిర, వైరా, సత్తుపల్లి, కొత్తగూడెం, అశ్వారావుపేట నియోజకవర్గాల్లో మంత్రులు ప్రచారం చేస్తుండగా.. కొన్ని సమావేశాలకు ముగ్గురు మంత్రులు కలిసి హాజరవుతున్నారు. ఇంకొన్నింటికి వేర్వేరుగా వెళ్తూ కార్యకర్తలకు సూచనలు చేస్తున్నారు.

కమ్యూనిస్టుల మద్దతు

ఓవైపు అభ్యర్థి ప్రచారం నిర్వహిస్తుండగా.. సీపీఎం, సీపీఐ రఘురాంరెడ్డికి మద్దతు ప్రకటించాయి. ఇప్పటికే సీపీఎం పార్లమెంట్ స్థాయి సమావేశంలో తీర్మానం చేశారు. ఇక సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సైతం కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతు ప్రకటించారు. ఈ మేరకు ప్రచారంలో కాంగ్రెస్ శ్రేణులతో పాటు సీపీఎం, సీపీఐ నేతలు కూడా హాజరవుతున్నారు.

పోలింగ్‌కు ఏర్పాట్లు చేశాం

జిల్లా ఎన్నికల అధికారి ప్రియాంక ఆల



వీసీలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రియాంక ఆల

సూపర్‌బజార్(కొత్తగూడెం): పార్లమెంట్ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి చేశామని జిల్లా ఎన్నికల అధికారి ప్రియాంక ఆల తెలిపారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ హైదరాబాద్ నుంచి బుధవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడారు. ఓటరు తుది జాబితా రూపొందించి గుర్తింపు పొందిన పార్టీ అభ్యర్థులకు అందజేశామని, ఓటరు స్లిప్పులను ప్రతీ ఓటరుకు అందేలా బూత్‌స్థాయి అధికారులతో పంపిణీ చేస్తున్నామని చెప్పారు. హోమ్ ఓటింగ్, పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటుహక్కు వినియోగించుకునే వారి వివరాలు జాబితాలో మార్క్ చేశామని అన్నారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న 1,889 ఓటరు గుర్తింపు కార్డులు మరో నాలుగు రోజుల్లో వస్తాయన్నారు. ఖమ్మం పార్లమెంట్ పరిధిలో 35 మంది, మహబూబాబాద్ పార్లమెంట్ పరిధిలో 23 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారని తెలిపారు. జిల్లాలో 1,105 పోలింగ్ కేంద్రాలకు గాను 1,385 బ్యాలెట్ యూనిట్లు, 1,551 వీవీ ప్యాట్‌లు కేటాయించామని, హోం ఓటింగ్ ప్రక్రియ పారదర్శకంగా జరిగేలా బృందాలను ఏర్పాటు చేశామని చెప్పారు. ఈనెల 4 నుంచి హోం ఓటింగ్ ప్రక్రియ ప్రారంభిస్తామని తెలిపారు. ప్రతి అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో ఈవీఎంల పంపిణీ, రిసెప్షన్ కేంద్రాల ఏర్పాటు పూర్తయిందని, రిసెప్షన్ కేంద్రం నుంచి స్ట్రాంగ్ రూంకు పోలింగ్ సామగ్రి తరలింపునకు కట్టుదిట్టమైన భద్రత కల్పిస్తున్నామని వివరించారు. ఓటర్లను ప్రలోభాలకు గురి చేయకుండా నిఘా ఏర్పాటు చేశామని చెప్పారు. గతం కంటే పోలింగ్ శాతం పెరిగేలా ఓటర్లకు అవగాహన కల్పిస్తున్నామని అన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు వేణుగోపాల్, విద్యాచందన, ఎస్‌డీసీ కాశయ్య, ఎలక్షన్ సూపరింటెండెంట్ దారా ప్రసాద్, ఎన్‌ఐసీ సుశీల్ పాల్గొన్నారు.

నేడు సీపీఐ పార్లమెంటరీ స్థాయి సమావేశం

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం పార్లమెంటరీ నియోజకవర్గ స్థాయి సీపీఐ సమావేశాన్ని గురువారం నిర్వహిస్తున్నట్లు పార్టీ ఖమ్మం, భద్రాద్రి జిల్లాల కార్యదర్శులు పోటు ప్రసాద్, ఎస్.కే.సాబీర్ పాషా తెలిపారు. ఖమ్మం ఎస్‌ఆర్ గార్డెన్స్‌లో ఉదయం 10గంటలకు ఈ సమావేశం మొదలవుతుందని పేర్కొన్నారు. ఈసమావేశంలో సీపీఐ జాతీయ, రాష్ట్ర కార్యదర్శులు కె.నారాయణ, రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి పాల్గొంటారని, కార్యకర్తలు అధికసంఖ్యలో హాజరు కావాలని కోరారు.

ఎమ్మెల్సీ ఎన్నికకు నేడు నోటిఫికేషన్

9వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ

నల్లగొండ : వరంగల్ – ఖమ్మం – నల్లగొండ నియోజకవర్గ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు గురువారం నోటిఫికేషన్ విడుదల కానుంది. ఎన్నికల అధికారి, నల్లగొండ కలెక్టర్ దాసరి హరిచందన నోటిఫికేషన్ విడుదల చేయనుండగా, నల్లగొండ కలెక్టరేట్‌లో నామినేషన్లు స్వీకరిస్తారు. కాగా, కలెక్టర్ లోక్‌సభ ఎన్నికల ఆర్‌ఓగా వ్యవహరిస్తుండడంతో ఎమ్మెల్సీ నామినేషన్ల స్వీకరణ కోసం ములుగు జిల్లా అదనపు కలెక్టర్‌ను నియమించారు. కలెక్టర్ అందుబాటులో లేని సమయాన ఆయన నామినేషన్లు స్వీకరిస్తారు.

పల్లా రాజీనామాతో..

2021లో జరిగిన ఎన్నికల్లో పట్టభద్రుల ఎమ్మెల్సీగా పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఎన్నికయ్యారు. ఆయన అసెంబ్లీ ఎన్నికల్లో జనగామ నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసి గెలవగా, ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేశారు. దీంతో ఇప్పటికే షెడ్యూల్ విడుదల చేయగా, గురువారం నోటిఫికేషన్ విడుదల చేసి ఈనెల 9వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. అలాగే, 10వ తేదీన పరిశీలించి, 13వ తేదీన ఉపసంహరణకు గడువు ముగిశాక బరిలో ఉన్న అభ్యర్థులను ప్రకటిస్తారు. ఇక 27వ తేదీన పోలింగ్ నిర్వహించి, జూన్ 5న ఓట్లు లెక్కిస్తారు. వరంగల్, ఖమ్మం, నల్లగొండ ఉమ్మడి జిల్లాల పరిధిలో ఇప్పటివరకు 4,61,806 మంది ఓటర్లు ఉండగా.. ఏప్రిల్ 30వ తేదీ వరకు దరఖాస్తులను పరిశీలించి ఈనెల 9న తుది జాబితా ప్రకటించనున్నారు.

బీఆర్‌ఎస్ మాటలు నమ్మి మోసపోకండి..

- బలరాంనాయక్ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పిలుపు



గుండాల : మాట్లాడుతున్న మంత్రి తుమ్మల, పక్కన బలరాం నాయక్, ఎమ్మెల్యే పాయం తదితరులు

గుండాల/టేకులపల్లి/ఇల్లెందు : గత పదేళ్లలో రాష్ట్ర ప్రజలు బీఆర్‌ఎస్‌ను నమ్మి మోసపోయారని, మళ్లీ ఆ పరిస్థితి రావద్దని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. మహబూబాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి బలరాంనాయక్ తరఫున బుధవారం ఆయన గుండాల, ఆళ్లపల్లి, టేకులపల్లి, ఇల్లెందు మండలాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తాను మంత్రిగా కొనసాగిన ప్రతీసారి ప్రత్యేక నిధులు తెచ్చి గుండాల, ఆళ్లపల్లి మండలాల్లో పలు అభివృద్ధి పనులు చేపట్టానని తెలిపారు. మిగిలిన పనులు సైతం ఈ ఐదేళ్లలో చేస్తానని హామీ ఇచ్చారు. ఈ ఎన్నికల్లో బలరాం నాయక్‌కు ఓటేస్తే రాహుల్‌గాంధీకి వేసినట్టేనని అన్నారు. 2014లోనూ బలరాంనాయక్ ఎంపీగా పని చేశారని, ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేశారని చెప్పారు. బీజేపీ, బీఆర్‌ఎస్‌కు ఓటడిగే హక్కు లేదన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే 6 గ్యారంటీలను అమలు చేశామని చెప్పారు. రాహుల్‌గాంధీ ప్రధాని అయితే రాష్ట్రాభివృద్ధికి అడిగినన్ని నిధులు ఇస్తారని, తద్వారా జిల్లాలోనూ మరిన్ని పనులు చేసుకునే అవకాశం ఉంటుందని చెప్పారు. బీజేపీకి ఓటేస్తే ఎస్సీ, ఎస్టీ, బీసీల రిజర్వేషన్లు రద్దవుతాయని, రాజ్యాంగాన్ని మారుస్తారని విమర్శించారు. ఇక మాజీ సీఎం కేసీఆర్ వివిధ సభల్లో మాట్లాడుతూ తాను భోజనం చేస్తుంటే, టిఫిన్ చేస్తుంటే కరెంటు పోతోందంటూ కాంగ్రెస్‌పై నిందలు మోపుతున్నారని, ఇలాంటి అసత్య ప్రచారాలు చేయడం ఆయనకు తగదని హితవు పలికారు. ఈనెల 4న కొత్తగూడెంలో నిర్వహించనున్న సీఎం రేవంత్‌రెడ్డి సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

పార్టీలో పలువురి చేరిక..

టేకులపల్లి ఎంపీపీ భూక్యా రాధ, ఆమె భర్త సైదులు, మాజీ ఉప సర్పంచ్‌లు గుగులోత్ మురళి, బానోత్ నగేష్, బాలునాయక్, పన్నాలాల్, గుగులోత్ రాములు బీఆర్‌ఎస్ నుంచి తుమ్మల సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఆయా కార్యక్రమాల్లో ఇల్లెందు, పినపాక ఎమ్మెల్యేలు కోరం కనకయ్య, పాయం వెంకటేశ్వర్లు, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు ఏలూరు కోటేశ్వరరావు, సీపీఐ, సీపీఎం, టీడీపీ, కాంగ్రెస్ నేతలు అయోధ్య, పుల్లారెడ్డి, నెల్లూరి నాగేశ్వరావు, నిమ్మల వెంకన్న, పోటు రంగారావు, చలపతిరెడ్డి, అనిల్‌కుమార్, భూక్యా దేవానాయక్, విజయ్‌గాంధీ, చందా సంతోష్, కొడెం ముత్యమాచారి, ఎస్‌కె. ఖదీర్, ఈసం పాపారావు, పాయం రాంనర్సయ్య, ఎండీ అతహార్, తాళ్లపల్లి వెంకన్న, గుగులోత్ రాంచంద్రు, భూక్య దళ్‌సింగ్, కోరం సురేందర్, బాలాజీరావు నాయక్, మంగీలాల్, ధర్మయ్య పాల్గొన్నారు.

కేసీఆర్ వెళ్లాక తుమ్మల పయనం

మాజీ సీఎం కేసీఆర్ కొత్తగూడెం నుంచి టేకులపల్లి, ఇల్లెందు మీదుగా మహబూబాబాద్ వెళ్తున్న సమయంలోనే మంత్రి తుమ్మల గుండాల, ఆళ్లపల్లి మండలాల్లో పర్యటన ముగించుకుని టేకులపల్లిలో సభలో పాల్గొనాల్సి ఉంది. ఈ తరుణంలో ఒకే సమయాన రాకపోకలు సాగే పరిస్థితి ఉండడం, ఇరువురు నేతలకు కాన్వాయ్‌లు ఉండటంతో కేసీఆర్ బస్సు యాత్ర ఇల్లెందు దాటాక మంత్రి తుమ్మల టేకులపల్లికి బయలుదేరారు. టేకులపల్లి సభకు వచ్చిన ప్రజలు, కార్యకర్తలు ఎదురు చూస్తున్నారనే సమాచారం అందినప్పటికీ కేసీఆర్ కాన్వాయ్ వెళ్లే క్రమంలో తుమ్మల ఇల్లెందు గెస్ట్‌హౌస్‌లో వేచి ఉండాల్సి వచ్చింది.

ఫలించిన వ్యూహం

- పదో తరగతిలో పెరిగిన ఉత్తీర్ణత శాతం
- జిల్లాలో 1,182 మంది ఫెయిల్..
- మ్యాథ్స్, సైన్స్‌లోనే ఎక్కువ మంది వెనుకబాటు
- ప్రత్యేక తరగతుల బోధనకు ప్రణాళిక

కొత్తగూడెంఅర్బన్: జిల్లాలో ఈ ఏడాది పదో తరగతిలో ఫెయిల్ అయిన విద్యార్థుల సంఖ్య కాస్త తగ్గింది. గత సంవత్సరం ఉత్తీర్ణత శాతం తక్కువగా నమోదు కాగా, ఈ ఏడాది పెంచాలనే సంకల్పంతో జిల్లా విద్యాశాఖ అధికారులు చేసిన ప్రయత్నం ఫలించింది. ఉత్తీర్ణత శాతం ఏ మండలం, ఏ పాఠశాలలో తక్కువగా ఉంటుందో పరిశీలించి ఆయా పాఠశాలల్లో సబ్జెక్టుల వారీగా ఉన్న, లేని ఉపాధ్యాయుల వివరాలు సేకరించారు. సబ్జెక్టు టీచర్లు లేని పాఠశాలలకు ఎక్కువగా ఉన్న ఇతర పాఠశాలల నుంచి పంపించారు. దీంతో అన్ని సబ్జెక్టుల్లోనూ వంద శాతం బోధన చేపట్టామని, అందుకే ఉత్తీర్ణత శాతం పెరిగిందని జిల్లా విద్యాశాఖ అధికారులు అంటున్నారు. అంతేకాక ఈ ఏడాది ప్రత్యేకంగా ప్రీఫైనల్ పరీక్షల ముందు స్పెషల్ టెస్ట్‌లు నిర్వహించారు. గతేడాది రాష్ట్ర స్థాయిలో 29వ స్థానంలో ఉన్న జిల్లా.. ఈ సంవత్సరం 26వ స్థానానికి తగ్గింది. రానున్న విద్యా సంవత్సరంలో మరింతగా కష్టపడి మొదటి పది స్థానాల్లో నిలిచేలా చూస్తామని అధికారులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. అయితే ఈ ఏడాది పదో తరగతి పరీక్షల్లో ఫెయిల్ అయిన వారిలో ఎక్కువగా మ్యాథ్స్, సైన్స్ సబ్జెక్టుల్లోనే కావడం గమనార్హం.

బాలురే అధికం..

పదో తరగతిలో జిల్లాలో మొత్తం 1,182 మంది విద్యార్థులు ఫెయిల్ కాగా వీరిలో 694 మంది బాలురు, 488 మంది బాలికలు ఉన్నారు. గతేడాది 1,456 బాలురు, 1,222 మంది బాలికలు ఫెయిలయ్యారు. ఈ ఏడాది మ్యాథ్స్‌లో 723 మంది, సైన్స్‌లో 487, సోషల్‌లో 262, ఇంగ్లిష్‌లో 237, తెలుగు 204, హిందీలో 76 మంది ఫెయిలయ్యారు. వీరంతా ఈ ఏడాదే ఇంటర్‌లో చేరేందుకు సప్లిమెంటరీ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు తర్ఫీదు ఇవ్వనున్నారు. ఆయా పాఠశాలల్లో ప్రత్యేక తరగతుల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

పదో తరగతి పరీక్షల్లో ఫెయిలయిన విద్యార్థుల కోసం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తాం. సప్లిమెంటరీ పరీక్షల్లో వారంతా ఉత్తీర్ణత సాధించేలా తర్ఫీదు ఇస్తాం. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి.

– ఎం.వెంకటేశ్వరాచారి, డీఈఓ

ఎండలతో భగ్గుమంటున్న జిల్లా



చుంచుపల్లి: నాలుగైదు రోజులుగా ఎండలు భగభగ మండుతున్నాయి. ఉదయం 9 గంటల నుంచి భానుడు ప్రభావం చూపిస్తున్నాడు. జిల్లా కేంద్రంలోని చుంచుపల్లిలో బుధవారం రికార్డుస్థాయిలో 46.2 డిగ్రీల పగటి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఈ వేసవిలో జిల్లాలో ఇదే అత్యధికం. ఎండల తీవ్రత దృష్ట్యా జిల్లాలో రెడ్ అలర్ట్ కొనసాగుతోంది. గత నెల 28న అశ్వాపురంలో 45.3 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదయింది. మండుతున్న ఎండలతో ప్రజలు అల్లాడిపోతున్నారు. వృద్ధులు, చంటి పిల్లలు విలవిల్లాడిపోతున్నారు. నాలుగైదు రోజులుగా పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. బయటకు వెళ్లాలంటే జంకుతున్నారు. జిల్లాలో మరో మూడు రోజులపాటు ఉష్ణోగ్రతలు ఇంకా పెరగడంతోపాటు వడ గాలులు తోడయ్యే ప్రమాదముందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఎండల్లో బయటకు వెళ్లేవారు తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

క్లుప్తంగా

అప్పట్లో అభ్యర్థికో ఇనుపపెట్టె

భద్రాచలంఅర్బన్: ఎన్నికల నిర్వహణలో ఇప్పుడు సాంకేతికత అందుబాటులోకి వచ్చినా గతంలో మాత్రం అనేక ఇబ్బందుల నడుమ పోలింగ్ కొనసాగేది. 1952, 1957ల లో జరిగిన ఎన్నికల్లో ఓటింగ్ సందర్భంగా ప్రతీ అభ్యర్థికి ఒక ఇనుప పెట్టె ఏర్పాటుచేసేవారు. ఓటర్లు తమకు నచ్చిన అభ్యర్థికి కేటాయించిన పెట్టెలో బ్యాలెట్ పత్రాలను వేసేవారు. 1962 సార్వత్రిక ఎన్నికల్లో ఇందులో మార్పులు చేసి పోలింగ్ బూత్‌కు ఒక పెట్టె ఏర్పాటు చేసే విధానం అమల్లోకి రాగా.. ఆ తర్వాత కొన్నికోట్ల ఎలక్ట్రానిక్ యంత్రాల వినియోగాన్ని ఆరంభించారు. ఆపై మార్పులు శరవేగంగా జరగడంతో అటు సిబ్బందికి శ్రమ తప్పగా.. పోలింగ్ నిర్వహణ, ఓట్ల లెక్కింపు సులభతరమైంది. అంతేకాక అక్రమాలు కూడా జరగడం లేదు.

నగదు, మద్యం స్వాధీనం



ఫ్లయింగ్ స్క్వాడ్ స్వాధీనం చేసుకున్న నగదు

దమ్మపేట: మండలంలోని మందలపల్లి రాష్ట్రీయ రహదారిపై ఉన్న ఎస్ఎస్టీ చెక్ పోస్ట్ వద్ద ఫ్లయింగ్ స్క్వాడ్ బుధవారం రాత్రి తనిఖీలు చేపట్టింది. మండలంలోని పలు దుకాణాల్లో సిగరెట్లు, బీడీలు విక్రయించే ఓ కంపెనీ డిస్ట్రిబ్యూటర్ ఆధారాలు లేకుండా తన వాహనంలో రూ.7,33,500 నగదు దమ్మపేట నుంచి సత్తుపల్లి తీసుకెళ్తుండగా పట్టుకుని స్వాధీనం చేసుకున్నారు. కొమ్ముగూడెం గ్రామంలోని బెల్ట్ దుకాణంలో అక్రమంగా విక్రయిస్తున్న ఐదు బీర్లు, 12 మద్యం క్వార్టర్ సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ తనిఖీల్లో ఫ్లయింగ్ స్క్వాడ్ పి.చంద్రశేఖర్, కృష్ణ, సిబ్బంది హరిబాబు, వెంకట్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నాటుసారా స్వాధీనం

దుమ్ముగూడెం : మండలంలోని చింతగుప్ప గ్రామంలో అక్రమంగా తరలిస్తున్న నాటుసారా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐలు కేశవరావు, పోటు గణేష్ తెలిపారు. బుధవారం గ్రామ శివారులో వాహన తనిఖీలు చేపట్టిన క్రమంలో సుజ్ఞానపురం గ్రామానికి చెందిన భూక్యా నగేష్ 30 లీటర్ల నాటు సారా తీసుకెళ్తుండగా పోలీసులు పట్టుకున్నారు. సారా, బైక్ స్వాధీనం చేసుకుని, నిందితుడిపై కేసు నమోదు చేశారు.

బైక్ దగ్ధం



దగ్ధమైన బైక్

ఇల్లెందురూరల్: మండలంలోని ముత్తారపుకట్ట గ్రామపంచాయతీలో బుధవారం వీరాపురం గ్రామానికి చెందిన ఓ రైతు బైక్ పూర్తిగా దగ్ధమైంది. రైతు కృష్ణ రోడ్డు పక్కనే బైక్ నిలిపి పొలం పనికి వెళ్లాడు. ఈ క్రమంలో చెత్తకు నిప్పు అంటుకుని మంటలు చెలరేగాయి. దీంతో మంటలు అంటుకుని బైక్ కొద్ది నిమిషాల్లోనే పూర్తిగా దగ్ధమైంది. గమనించిన స్థానికులు మంటలను ఆర్పే ప్రయత్నం చేసినా ఫలితం లేకుండా పోయింది.

జామాయిల్‌తోట దగ్ధం

పాల్వంచరూరల్: జామాయిల్‌తోట దగ్ధమైన ఘటనపై బుధవారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. మండల పరిధిలోని పునుకుల గ్రామ సమీపంలోఉన్న మందలపు వెంకటేశ్వరరావు జామాయిల్‌తోట దగ్ధమైంది. మంగళవారం గుర్తుతెలియని వ్యక్తి నిప్పంటించడంతో మంటలు చెలరేగి తోట కాలిపోయింది. తోటలో ఉన్న 250 టేకు చెట్లు కూడా దగ్ధమయ్యాయి. రూ. 2 లక్షల ఆస్తి నష్టం వాటిల్లిందని బాధిత రైతు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు ఎస్ఐ.బి.శ్రీనివాస్ తెలిపారు.

వడదెబ్బతో వృద్ధుడి మృతి

ఇల్లెందు : ఇల్లెందు పట్టణంలోని నంబర్- 2 బస్తీకి చెందిన చొప్పరి గోపాలరావు (80) వడ దెబ్బతో బుధవారం మృతి చెందాడు. తీవ్రంగా వడగాలి వీయడంతో అస్వస్థతకు గురయ్యాడని, దాహంతో అల్లాడుతూ తుదిశ్వాస విడిచాడని కుటుంబసభ్యులు తెలిపారు.

భవన నిర్మాణ కార్మికుడి మృతి

హైదరాబాద్‌లో ఘటన

భద్రాచలంఅర్బన్: భద్రాచలంలోని శాంతినగర్ కాలనీకి చెందిన శైలేష్(18) హైదరాబాద్‌లో బుధవారం మృతి చెందాడు. ఆయన బంధువుల కథనం ప్రకారం.. శైలేష్ భవన నిర్మాణ పనుల నిమిత్తం హైదరాబాద్ వెళ్లాడు. పని చేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు పిట్టగోడ పైనుంచి నిర్మాణ పనుల్లో ఉపయోగించే లిఫ్ట్‌లో పడగా తీవ్రగాయాలై మృతి చెందాడు. బంధువులు మృతదేహాన్ని స్వస్థలానికి తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.14,229

నీటి తడులు ముఖ్యం

ఆయిల్‌పామ్ తోటల్లో వేసవిలో జాగ్రత్తలు

- మండుతున్న ఎండలతో తగ్గుతున భూగర్భ జలాలు
- సరిపడా నీరందకపోతే గెలల దిగుబడి తగ్గే అవకాశం
- అధిగమించేందుకు ఆయిల్‌ఫెడ్, ఉద్యానశాఖ అధికారుల సూచనలు



ఆకుల బాలకృష్ణ



రైతులు సాగు చేస్తున్న ఆయిల్‌పామ్ తోట

అశ్వారావుపేటరూరల్: ఎండలు మండుతుండటంతో భూగర్భ జలాలు పడిపోతున్నాయి. ప్రస్తుతం ఉష్ణోగ్రతలు 45 సెల్సియస్ డిగ్రీల వరకు నమోదవుతున్నాయి. ఏప్రిల్‌తోపాటు మే నెలలో ఇంకా ఎండల తీవ్రత పెరిగే అవకాశం ఉంది. ఈ సమయంలో ఆయిల్ పామ్ మొక్కలకు సరిపడా నీరందకపోతే క్రమంగా దిగుబడి తగ్గుతుంది. ఇప్పటికే మొక్కలు వడబడుతున్నాయని పలువురు రైతులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో వేసవి తాపం నుంచి తోటలను రక్షించుకునేందుకు, దిగుబడి తగ్గకుండా ఉండేందుకు అశ్వారావుపేట ఆయిల్‌ఫెడ్ డివిజనల్ మేనేజర్ ఆకుల బాలకృష్ణ, ఖమ్మం జిల్లా ఉద్యానాధికారి బీవీ రమణ పలు సూచనలు చేశారు. కాగా భద్రాద్రి జిల్లాలో 64,253 ఎకరాల్లో, ఖమ్మం జిల్లాలో 22,941 ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు చేస్తున్నారు.

ఇవి పాటించాలి

- ఒకటి నుంచి మూడేళ్ల వయసు కలిగిన తోటల్లో మొక్కకు మూడు అడుగుల దూరంలో జనుమును పచ్చి రొట్టె ఎరువుగా నాటుకోవాలి. జనుము పూతకు వచ్చాక చిన్న, చిన్న ముక్కలుగా కోసి ఆయిల్‌పాం మొక్క చుట్టూ వేయాలి. మొక్క చుట్టూ జనుము, జీలుగ విత్తనాలు చల్లుకుని ఎండ తీవ్రత నుంచి మొక్కలను రక్షించుకోవచ్చు.
- ప్రతి మొక్కకు ఇరువైపులా ఒక్కో మైక్రోజెట్ (30 లీటర్లు లేదా 40 లీటర్లు) డిశ్చార్జ్ అయ్యేవి అమర్చుకోవాలి.
- వేసవి కాలంలో రోజుకు చిన్న మొక్కలకు రోజుకు 150 నుంచి 165 లీటర్లు, ఎదిగిన పెద్ద మొక్కలకు 250 లీటర్ల నుంచి 350 లీటర్ల వరకు నీరు అందించాలి. చెట్టుకు ఇరువైపులా గంటకు 40 లీటర్ల నీటి సరఫరా సామర్థ్యం ఉంటే రోజుకు రెండు గంటలపాటు నీరు సరఫరా చేయాలి.
- డ్రిప్ ద్వారా మాత్రమే నీటిని అందించాలి. చల్లని వేళ ఉదయం 8 గంటల లోపు, సాయంత్రం 5 గంటల తర్వాత మాత్రమే తడులను ఇవ్వాలి.
- వేసవిలో భూమిలో తేమశాతం తగ్గి, సరిపడా నీరందకపోతే ఆకుల ఉత్పత్తి, మొక్క పెరుగుదల తగ్గి, మగ పుష్పాలు అధికంగా వస్తాయి. ఆడ పుష్పాలు తగ్గిపోయి దిగుబడులు తగ్గిపోతాయి. కలుపు నివారణ చర్యలు పాటించాలి.
- మూడేళ్లలోపు వయసు ఉన్న మొక్కల్లోని పూగుత్తులను ప్రతి నెలా అబ్లేషన్ సాధనంతో రెండు సార్లు తొలగించుకోవాలి.
- అవసరం మేరకు మాత్రం(అన్నీ చెట్లు కాకుండా) ఎండిన, విరిగిన లేదా చీడ పీడలు ఆశించిన ఆకులను మాత్రమే తొలగించుకోవాలి. చెలుపు లేదా వృథాగా పచ్చి ఆకులను నరకవద్దు.
- అంతర పంటలు వేస్తే ఆయిల్‌పాంతోపాటు అంతర పంటలకు కూడా సిఫార్సు మేరకు నీరు అందే విధంగా చూడాలి.
- రైతు డైరీలలో సిఫార్సు చేసిన పద్ధతిలో పోషకాలను తప్పనిసరిగా అందించాలి. ఆ వివరాలను రైతు డైరీల్లో నమోదు చేసుకోవాలి.
- గెలలు కోశాక, నరికి ముక్కలుగా చేసిన ఆయిల్‌పాం ఆకులను, మగ పూలగుత్తులను, మొక్కజొన్న చొప్పను, ఖాళీ ఆయిల్‌పాం గెలలను పాదుల్లో మల్చింగ్ చేయాలి.



ఆయిల్‌పామ్ మొక్కల చుట్టూ వేసిన జనుము

- ఎదిగిన తోటలకు నెలకు ఎకరాకు ఐదు కేజీల యూరియా, మూడు కేజీల డీఏపీ, ఐదు కేజీల మ్యూరేట్ ఆఫ్ పొటాష్, 2.5కేజీల మెగ్నిషియం సల్ఫేట్‌ను, కేజీ బోరాక్స్‌ను విడివిడిగా నీటిలో కరిగించి ఫెర్టిగేషన్ ద్వారా మొక్కలకు అందించాలి. ఇలా చేయడం ద్వారా సమయం, ఎరువుల ఖర్చు ఆదా చేసుకోవచ్చు.
- మొక్కలకు నీరు అందించేందుకు ఏర్పాటు చేసిన డ్రిప్ నాజిల్స్‌ను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలి.
- ఆయిల్‌పాం తోటల్లో అధికంగా పోషక లోపాలు కనిపిస్తే మట్టి, పాత్ర విశ్లేషణ కోసం పంపించాలి.

నిఘా నీడ... పక్కా పర్యవేక్షణ

- ప్రతీ మండలానికి ఐదు బృందాలు
- ఒక్కో బృందానికి సీసీ కెమెరాతో కూడిన వాహనం
- ఎన్నికల వేళ అక్రమాలకు చెక్ పెట్టేలా పర్యవేక్షణ



తనిఖీ బృందానికి కేటాయించిన కెమెరాతో కూడిన వాహనం

నేలకొండపల్లి/భద్రాచలంఅర్బన్: లోక్‌సభ ఎన్నికల వేళ నిబంధనలు పకడ్బందీగా అమలు చేసేందుకు కేంద్ర ఎన్నికల సంఘం నిఘా వ్యవస్థను పటిష్టం చేసింది. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు సాంకేతిక విధానాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. నగదు, మద్యం, మాదకద్రవ్యాల పంపిణీకి అడ్డుకట్ట వేసేందుకు తనిఖీల కోసం నియమించిన బృందాలు నిత్యం తనిఖీ చేస్తున్నాయి. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఈ బృందాలకు సమకూర్చిన 360 డిగ్రీ కెమెరాలతో కూడిన వాహనాలతో సత్ఫలితాలు రావడంతో లోక్‌సభ ఎన్నికల్లోనూ ఇదే విధానం అవలంబిస్తున్నారు.

నియోజకవర్గానికి ఐదేసి బృందాలు

ఒక్కో లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గానికి ఐదు చొప్పున బృందాలను నియమించారు. ఈ మేరకు ఖమ్మం పార్లమెంట్ పరిధిలోని ఏడు, మహబూబాబాద్ పార్లమెంట్ పరిధిలోని మూడు అసెంబ్లీ నియోజకవర్గాలకు నియమించిన ఆయా బృందాల్లో పోలీస్, రెవెన్యూ, పంచాయతీరాజ్, ఇతర శాఖల ఉద్యోగులకు విధులు కేటాయించారు. ఫ్లయింగ్ స్క్వాడ్‌లో పోలీస్ అధికారి, ఒక వీడియోగ్రాఫర్, స్టాటిక్ సర్వైలెన్స్‌లో డిప్యూటీ తహసీల్దార్, పోలీస్, ఎక్సైజ్ శాఖ సిబ్బంది ఉంటారు. ఇక వీడియో సర్వైలెన్స్ బృందం ద్వారా వచ్చిన వీడియోలను వీడియో వ్యూయింగ్ బృందం సభ్యులు నిశితంగా పరిశీలిస్తారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్(ఎంసీసీ) బృందంలో గెజిటెడ్ అధికారితో పాటు పోలీస్ సిబ్బంది, వీడియోగ్రాఫర్ ఉంటారు. ఇవేకాక మరో రెండు బృందాలను కూడా నియమించగా.. అభ్యర్థుల నిబంధనల ఉల్లంఘన, అభ్యర్థుల ప్రచారం, ఖర్చులపై వీరు నిఘా వేశారు.

రాష్ట్ర కార్యాలయానికి అనుసంధానం

నిఘా బృందాల వాహనాలకు 360 డిగ్రీల కోణంలో దృశ్యాలు రికార్డు చేయగలిగే సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన కెమెరాలు అమర్చారు. అలాగే, ఫుటేజీ నేరుగా రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యాలయానికి అనుసంధానించారు. తద్వారా ఉద్యోగులు ఎక్కడ తనిఖీ చేస్తున్నారు, నిబంధనలు పాటిస్తున్నారా అనేది పర్యవేక్షించే వీలు కలుగుతోంది.

కలిసొచ్చిన 'ఎర్లీ బర్డ్'!

- రాయితీపై ఆస్తిపన్ను చెల్లింపులకు స్పందన
- కేఎంసీకి రూ.9.73 కోట్ల జమ
- మూడు మున్సిపాలిటీల్లో రూ.కోటి దాటిన ఆదాయం
- మిగతా నాలుగు చోట్ల నిరాశే



ఖమ్మంమయూరిసెంటర్: మున్సిపాలిటీలు, కార్పొరేషన్లకు ఆస్తి పన్నుల ద్వారానే అత్యధిక ఆదాయం సమకూరుతుంది. ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన పన్నులను ప్రారంభ నెల అయిన ఏప్రిల్‌లోనే రాబట్టేందుకు ప్రభుత్వం ఏటా రాయితీ ప్రకటిస్తోంది. ఎర్లీబర్డ్ స్కీం కింద ఏప్రిల్‌లో మొత్తం ఆస్తి పన్ను చెల్లించిన వారికి 5 శాతం రాయితీ వర్తిస్తుంది. ఈ అంశంపై మొదటి నుంచే అధికారులు విస్తృత ప్రచారం చేయడంతో ఖమ్మం కార్పొరేషన్ సహా ఉమ్మడి జిల్లాలోని మున్సిపాలిటీల పరిధిలో యజమానులు ఆస్తి పన్ను చెల్లించేందుకు ముందుకొచ్చారు. అధికారులు ఓ పక్క ఎన్నికల విధులు నిర్వర్తిస్తూనే.. మరోవైపు ఆదాయంపై దృష్టి సారించారు. ఈనేపథ్యాన ఎర్లీబర్డ్ స్కీం ద్వారా ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌కు భారీగా ఆదాయం సమకూరింది. మొత్తం 14,527 అసెస్‌మెంట్లకు సంబంధించి రూ.9.73 కోట్ల మేర పన్నులు వసూలయ్యాయి. కాగా, ప్రభుత్వం ప్రకటించిన ఎర్లీబర్డ్ స్కీం ఏప్రిల్ 30వ తేదీతో ముగియగా.. చివరి రోజైన మంగళవారం ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో రూ.కోటికి పైగా వసూలు చేయడం విశేషం. ఇక సత్తుపల్లి, పాల్వంచ, కొత్తగూడెం మున్సిపాలిటీల్లోనూ ఎర్లీ బర్డ్ స్కీం ద్వారా రూ.కోటికి పైగా ఆదాయం సమకూరింది. వైరా, మధిరలో రూ.కోటి లోపే సమకూరగా.. మణుగూరు, ఇల్లెందులో మాత్రం నిరాశజనక ఫలితాలు నమోదయ్యాయి.

వసూలైన పన్నుల వివరాలిలా (రూ.కోట్లలో)

కార్పొరేషన్/ మున్సిపాలిటీ	అసెస్‌మెంట్లు	వసూలైన పన్ను
ఖమ్మం	14,527	9.73
సత్తుపల్లి	1,865	1.32
కొత్తగూడెం	2,174	1.07
పాల్వంచ	2,878	1.07
వైరా	1,726	0.69
మధిర	1,625	0.58
మణుగూరు	1,099	0.39
ఇల్లెందు	752	0.30

రౌడీ షీటర్ల కదలికలపై నిఘా

ఎస్పీ రోహిత్‌రాజు



మాట్లాడుతున్న ఎస్పీ రోహిత్‌రాజు

కొత్తగూడెంఅర్బన్: పాత నేరస్తులు, రౌడీ షీటర్ల కదలికలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని ఎస్పీ రోహిత్‌రాజు సూచించారు. బుధవారం కొత్తగూడెం పట్టణంలోని ఐఎంఏ హాల్‌లో జిల్లా పోలీసు అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలందరూ నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకునేలా, ప్రశాంత వాతావరణంలో పోలింగ్ జరిగేలా చూడాలన్నారు. చెక్‌పోస్టుల వద్ద అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఏఎస్పీలు టి.సాయి మనోహర్, ఏఎస్పీ పరితోష్ పంకజ్, డీఎస్పీలు రెహమాన్, సతీష్‌కుమార్, రవీందర్‌రెడ్డి, చంద్రభాను, ట్రైనీ ఐపీఎస్ విక్రాంత్ సింగ్ సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాపై సమీక్ష




సమీక్ష నిర్వహిస్తున్న విద్యుత్ శాఖ ఎస్ఈ

సూపర్‌బజార్(కొత్తగూడెం): కొత్తగూడెం, పాల్వంచ మున్సిపాలిటీలలో విద్యుత్ సరఫరాపై బుధవారం భజనమందిర్ సబ్ స్టేషన్‌లో విద్యుత్ ఎస్ఈ కె.రమేష్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఆర్థిక సంవత్సరంలో రెండు మున్సిపాలిటీల్లో 30 శాతం అంతరాయాలు తగ్గించామని తెలిపారు. పెరుగుతున్న విద్యుత్ అవసరాల కోసం కొత్తగూడెంలోని ప్రగతినగర్ సబ్‌స్టేషన్‌లో, పాల్వంచలోని ఇందిరానగర్ సబ్‌స్టేషన్‌లో రూ.65 లక్షల వ్యయంతో రెండు 5 ఎంవీఏ అదనపు పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసినట్లు వివరించారు. లోఓల్టేజి సమస్యను అధిగమించేందుకు, నాణ్యమైన విద్యుత్ సరఫరాకు నూతనంగా 30 విద్యుత్ సబ్‌స్టేషన్లను నిర్మించినట్లు తెలిపారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలను తగ్గించేందుకు ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద 40 ఎస్‌బీ స్విచ్‌లు, 11కేవీ లైన్ల వద్ద 22 ఎస్‌బీ స్విచ్‌లను ఏర్పాటు చేశామన్నారు. ఈ నెల ఒకటి నుంచి 7వ తేదీ వరకు భద్రతా వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ ఉద్యోగులు, వినియోగదారులు ప్రమాదాలకు గురికాకుండా జాగ్రత్తలను పాటించాలన్నారు. కార్యక్రమంలో డీఈ నందయ్య, ఏడీఈలు హేమచంద్రబాబు, వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ మార్గంలోనూ ఓటరు చైతన్యం

ఓటింగ్ శాతం పెంచేలా ఎన్నికల సంఘం విస్తృతంగా అవగాహన కల్పిస్తోంది. ఇందులో భాగంగా అంది వచ్చిన ఏ అవకాశాన్ని వదలకుండా ఓటర్ల దరి చేరేందుకు ప్రయత్నిస్తోంది. ఈ మేరకు ఓటర్లు ఎక్కువగా వినియోగిస్తున్న ఫోన్ పే, గూగుల్ పే హోం పేజీల్లోనూ 'లెట్స్ ఓట్ విత్ ప్రైడ్(రండి సగర్వంగా ఓటేద్దాం)' నినాదం కనిపిస్తుండడంతో ఓటర్లు ఆసక్తిగా పరిశీలిస్తున్నారు.

– భద్రాచలంఅర్బన్



పేటీఎం హోం పేజీలో ఓటరు నినాదం

పలు రైళ్ల రద్దు.. ఇంకొన్ని దారి మళ్లింపు

ఖమ్మం రాపర్తినగర్: రైల్వే శాఖ ఇప్పటికే పలు రైళ్లను రద్దు చేయగా.. మరికొన్నింటిని దారి మళ్లించింది. కరోనా సమయం నుంచి రైళ్లను తరచూ రద్దు చేస్తుండగా, ఇటీవల మూడో రైల్వేలైన్ నిర్మాణం పేరిట ఈ సమస్య మరింత పెరిగింది. ఓ పక్క వేసవి సెలవులు కావడంతో పిల్లలతో ప్రయాణాలకు సిద్ధమైన వారు రైళ్ల రద్దు కారణంగా అవస్థ పడుతున్నారు. అలాగే, కొనసాగుతున్న కొన్ని రైళ్లలోనూ సరిపడా జనరల్ బోగీలు లేకపోవడం మరింత సమస్యకు కారణమవుతోంది. కాగా, రెండు వైపులా గోల్కొండ ఎక్స్‌ప్రెస్, శాతవాహన ఎక్స్‌ప్రెస్‌లను గత నెల 29నుంచి ఈనెల 5వరకు రద్దు చేయగా, మళ్లీ 16 తేదీన సైతం నడవవని అధికారులు ప్రకటించారు. అలాగే, కృష్ణా ఎక్స్‌ప్రెస్ ఈనెల 5వ తేదీ వరకు, మళ్లీ 19వ తేదీన, హైదరాబాద్–నర్సాపూర్ ఎక్స్‌ప్రెస్(07631)ను 18వ తేదీ వరకు, నర్సాపూర్–హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్(07632)ను 19వ తేదీ వరకు రద్దు చేశారు. ఇక గోరఖ్‌పూర్–కుచ్‌వెళ్లి(12511) రైలును 2, 3, 5, 9, 16వ తేదీల్లో, కుచ్‌వెళ్లి–గోరఖ్‌పూర్(12512) ఎక్స్‌ప్రెస్‌ను 1, 5, 7, 8, 15, 19, 21 తేదీల్లో రద్దు చేసినట్లు వెల్లడించారు. అంతేకాక బరోని–ఎర్నాకులం(12521) రైలును 6, 20వ తేదీల్లో, ఎర్నాకులం – బరోని ఎక్స్‌ప్రెస్(12522)ను 3, 10, 17వ తేదీల్లో, ఇండోర్–కుచ్‌వెళ్లి(22645) రైలును 5, 7, 20వ తేదీల్లో, కుచ్‌వెళ్లి – ఇండోర్(22646) ఎక్స్‌ప్రెస్‌ను 2, 7, 9, 18వ తేదీల్లో, కోర్బా – కుచ్‌వెళ్లి(22647) రైలును 6, 15, 18వ తేదీల్లో కుచ్‌వెళ్లి – కోర్బా(22648) ఎక్స్‌ప్రెస్‌ను 4, 16, 20వ తేదీల్లో రద్దు చేశారు. అలాగే, విశాఖపట్నం–న్యూఢిల్లీ(20805) రైలును మే 16వ తేదీ వరకు, మళ్లీ 22న దారి మళ్లించనున్నారు. ఇదే రైలును తిరుగు ప్రయాణంలో ఈనెల 9వ తేదీవరకు, మళ్లీ 15నుంచి 21వ తేదీ వరకు దారి మళ్లిస్తున్నట్లు అధికారులు ప్రకటించారు.

'కోణార్క్'లో 14కేజీల గంజాయి స్వాధీనం

ఖమ్మంక్రైం: ఖమ్మం రైల్వేస్టేషన్ పరిధిలో ఆర్‌పీఎఫ్, జీఆర్‌పీ పోలీసులు చేపట్టిన తనిఖీల్లో బుధవారం 14 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఆర్‌పీఎఫ్ సీఐ శ్రీనివాస్‌రెడ్డి తెలిపిన వివరాలు... ముంబై వెళ్లే కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లోని ఎస్–1 కోచ్‌లో తనిఖీలు చేపట్టగా ఓ సీటు కింద రెండు బ్యాగ్‌ల్లో తీసుకెళ్తున్న 14కేజీల ఎండిన గంజాయి పట్టుబడింది. దీని విలువ రూ.3.50లక్షలు ఉండగా, జీఆర్‌పీ పోలీసులకు అప్పగించారు. కాగా, ఈ ఏడాది ఇప్పటి వరకు రూ.9లక్షలకు పైగా విలువైన గంజాయిని స్వాధీనం చేసుకున్నామని సీఐ తెలిపారు.

యువకుడి అదృశ్యంపై కేసు

ఖమ్మంఅర్బన్: ఖమ్మం కవిరాజ్‌నగర్‌కు చెందిన కార్పెంటర్ సోమోజు శివకృష్ణ కానరాకుండా పోయాడని ఆయన తల్లి ఇచ్చిన ఫిర్యాదుతో బుధవారం కేసు నమోదు చేసినట్లు ఖమ్మం అర్బన్ పోలీసులు తెలిపారు. మధిరకు చెందిన శివకృష్ణ కుటుంబం కొన్నేళ్లుగా ఖమ్మంలో నివాసముంటోంది. గత నెల 25న వరంగల్‌లో మిత్రుడి ఇంట్లో పెళ్లి ఉందని చెప్పి శివకృష్ణ వెళ్లాడు. ఇప్పటివరకు తిరిగి రాకపోవడంతో మిత్రుడికి ఫోన్ చేస్తే తమ ఇంటికి రాలేదని చెప్పాడు. దీంతో ఎక్కడ ఆరా తీసినా ఆచూకీ లేకపోవడంతో ఆయన తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కాగా, ఆన్‌లైన్ గేమ్‌లో ఆయన కొంత నగదు పోగొట్టుకున్నట్లు అనుమానముందని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

అశ్వారావుపేటరూరల్: అప్పుల బాధతో పురుగుల మందు తాగిన వ్యక్తి చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున మృతి చెందాడు. హెడ్ కానిస్టేబుల్ నాగేశ్వరరావు కథనం ప్రకారం.. మండల కేంద్రంలోని ఫైర్ కాలనీకి చెందిన మంచిరాజు ఛాయా బాలశేషగిరిరావు(39) నాలుగేళ్ల క్రితం తన తల్లికి కేన్సర్ వైద్యం చేయించేందుకు అప్పు చేశాడు. ఈ నాలుగేళ్లలో తీసుకున్న అప్పులతోపాటు వడ్డీ పెరగడంతో తిరిగి చెల్లించలేకపోయాడు. తన ఇల్లు విక్రయించిన అప్పులు, వడ్డీలకు సరిపోవడం లేదని గత నెల 3న కొత్తగూడెం సీనియర్ సివిల్ న్యాయస్థానంలో రూ.52.60 లక్షలకు ఐపీ దాఖలు చేశాడు. ఇందుకు సంబంధించిన అనుమతి పత్రాలు రాలేదు. ఈ క్రమంలోనే అప్పులబాధ అధికం కావడంతో భరించలేక మూడు రోజుల క్రితం ఇంట్లోనే పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబీకులు కొత్తగూడెం ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతుడి సోదరుడు వెంకట పవన్ ఫిర్యాదు మేరకు.. మృతదేహానికి పోస్టుమార్టం జరిపించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

మనస్తాపంతో యువకుడు..

అన్నపురెడ్డిపల్లి: పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటనపై బుధవారం కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం... మండల పరిధిలోని నామవరం గ్రామానికి చెందిన బేతి నాగరాజు(20) కూలి పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల ఫైనాన్స్‌లో ద్విచక్ర వాహనాన్ని కొనుగోలు చేశాడు. డ్రైవింగ్ లైసెన్స్ కోసం తల్లిని రూ.5 వేలు అడగగా, ప్రతి నెలా బైక్ కిస్తీ కట్టడానికే డబ్బుల లేవని తల్లి మందలించింది. దీంతో మనస్తాపం చెంది మంగళవారం పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు 108 వాహనంలో కొత్తగూడెం ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతి చెందాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతున్న యువకుడు మృతి



పవన్‌కృష్ణ (ఫైల్)

కామేపల్లి: మండలంలోని పండితాపురానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు మద్దినేని రమేష్‌బాబు కుమారుడైన జూనియర్ డాక్టర్ పవన్‌కృష్ణ(26) నెల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. విజయవాడ సమీపాన జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆయనకు స్థానికంగా చికిత్స చేయిస్తూ, మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలిస్తుండగా మృత చెందాడు. ఈమేరకు డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, నాయకులు రాయల నాగేశ్వరరావు, పోట్ల నాగేశ్వరరావు, రాంరెడ్డి గోపాల్‌రెడ్డి, జావీద్, మిక్కిలినేని నరేందర్, వేణు, గుజ్జర్లపూడి రాంబాబు, ధనియాకుల హన్మంతరావు తదితరులు పవన్ మృతదేహం వద్ద నివాళులర్పించి ఆయన కుటుంబీకులను పరామర్శించారు.

క్లుప్తంగా...

తీన్మార్ మల్లన్నను గెలిపించాలి



సాక్షి, హైదరాబాద్: ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం, వరంగల్ జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న గెలుపునకు కృషి చేయాలని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.శివసేనారెడ్డి కోరారు. గాంధీభవన్‌లో బుధవారం ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం, వరంగల్ జిల్లాల యూత్ కాంగ్రెస్ సమావేశం జరిగింది. సమావేశంలో అభ్యర్థి తీన్మార్ మల్లన్నతో పాటు మూడు జిల్లాల యువజన కాంగ్రెస్ నాయకులు సమావేశమై కార్యాచరణ గురించి చర్చించారు. ప్రతి పట్టభద్రుడిని కలిసి ఎమ్మెల్సీగా కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు ఆవశ్యకతను వివరించాలని కోరారు. యూత్ కాంగ్రెస్ పక్షాన తీన్మార్ మల్లన్నకు సంపూర్ణ సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

ఓయూకి నిధులివ్వకుండా బీఆర్ఎస్ నిర్లక్ష్యం

- అధికార ప్రతినిధి చనగాని దయాకర్

సాక్షి, హైదరాబాద్: పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఉస్మానియా యూనివర్సిటీకి నిధులు, నియామకాలు చేపట్టకుండా నిర్లక్ష్యం చేశారని టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్ ఆరోపించారు. బుధవారం ఆయన గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ ఓయూకు కేసీఆర్ చేసింది శూన్యమని, ఉస్మానియా భూములు అమ్ముకున్నారని మండిపడ్డారు. గతంలో 1,200 మంది అధ్యాపకులు ఉంటే ప్రస్తుతం 320 మంది ఉన్నారని ధ్వజమెత్తారు. కేసీఆర్ హయాంలో జరిగిన భూ లావాదేవీలపై శ్వేతపత్రం విడుదల చేయాలని దయాకర్ డిమాండ్ చేశారు. ఓయూలో డ్రైనేజీ వ్యవస్థ చాలా దారుణంగా ఉన్నా.. ఒక్క రోజు కూడా పట్టించుకోలేదన్నారు. ఓయూ వందేళ్ల ఉత్సవాల్లో భారీగా అవినీతి జరిగిందని, ఉత్సవాల కాంట్రాక్టు కేటీఆర్ సన్నిహితులకు ఇచ్చారని తెలిపారు. ప్రైవేటు యూనివర్సిటీలకు కేటీఆర్ అనుమతిచ్చి విద్య దోపిడీకి పాల్పడ్డారని దయాకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

బస్తర్‌లో నేలకొరిగిన తొలితరం మావోయిస్టు

టేక్‌మెటా ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు తెలంగాణ నేతలు ● మృతుల్లో చీమల నర్సయ్య, కాసరవెల్లి వినయ్

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం/బెల్లంపల్లి: బస్తర్‌లో మావోయిస్టు పార్టీకి మరో ఎదురుదెబ్బ తగిలింది. ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణపూర్–కాంకేర్ సరిహద్దులో టేక్‌మెటా సమీపంలో మంగళవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో బస్తర్‌లో నక్సలైట్ ఉద్యమాన్ని ప్రారంభించిన తొలితరం నేతల్లో ఒకరైన చీమల నర్సయ్య ఆలియాస్ జోగన్న, కాసరవెల్లి వినయ్ ఆలియాస్ రవి నేలకొరిగారు. మృతుల ఫొటోలు బయటకు రావడంతో వారి కుటుంబసభ్యులు ఛత్తీస్‌గఢ్‌కు పయనమయ్యారు.

పార్టీ విస్తరణలో నర్సయ్య కీలకపాత్ర

1980వ దశకంలో నక్సలైట్ ఉద్యమం తెలంగాణలో ఊపందుకుంది. కొండపల్లి సీతారామయ్య ఆధ్వర్యంలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పార్టీ పట్టు సాధించింది. ఇదే సమయంలో ఉద్యమాన్ని అణచివేసేందుకు ప్రభుత్వం నిర్బంధం పెంచింది. ఈ క్రమంలో తెలంగాణలో తొలి ఎన్‌కౌంటర్ 1982 చివరలో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని చినమెట్‌పల్లి దగ్గర జరగ్గా, అంకం నారాయణ, మాసం గజేందర్ చనిపోయారు. ఆ వెంటనే 1983 ఫిబ్రవరి 3న పెద్దపల్లి జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు అగ్రనేత గణపతి సమకాలికుడు బయ్యపు దేవేందర్‌రెడ్డి మరణించారు. ఆ తర్వాత



ఏప్రిల్‌లో జరిగిన మూడో ఎన్‌కౌంటర్ తెలంగాణ సరిహద్దు మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లా అంకీస దగ్గర జరగగా పెద్ది శంకర్ ప్రాణాలు కోల్పోయారు. దీంతో చైనాలో మావో జెడాంగ్ అనుసరించిన వ్యూహం తరహాలో మైదాన ప్రాంతంతోపాటు అటవీ ప్రాంతంలో మరో షెల్టర్ జోన్ కోసం ఆనాటి నక్సలైట్లు అన్వేషణ సాగించారు. ఈ క్రమంలో బస్తర్ అటవీ ప్రాంతాన్ని ఎంపిక చేసుకుని తొలి బ్యాచ్‌ను 1982లో అక్కడకు పంపారు. అలా వెళ్లిన తొలితరం నాయకుల్లో చీమల నర్సయ్య కూడా ఉన్నారు. ఇతని స్వగ్రామం పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలంలోని జయ్యారం. 42 ఏళ్లుగా బస్తర్‌లో పనిచేస్తూ సాయుధ విప్లవానికి బస్తర్ అడవులను కేంద్ర స్థానంగా నిలపగలిగారు. ఇప్పటికీ 'రెడ్ కారిడార్'కు బస్తర్ కీలకంగా ఉంది.

సికాస నుంచి వినయ్

కాసరవెల్లి వినయ్‌ని పార్టీ అగ్రనేత కటకం సుదర్శన్ శిష్యుడిగా చెప్పుకుంటారు. వినయ్ తండ్రి రాజయ్యకు సింగరేణిలో ఉద్యోగం రావడంతో కుటుంబంతో సహా బెల్లంపల్లికి వచ్చాడు. 1990లో విద్యార్థి ఉద్యమాల ద్వారా వినయ్ విప్లవాల వైపు ఆకర్షితుడయ్యారు. ఆ తర్వాత సింగరేణి కార్మిక సమాఖ్య (సికాస)లో కీలకంగా పనిచేశారు. నిర్బంధం ఎక్కువ కావడంతో చెన్నూర్ దళంలో కొంతకాలం పనిచేశాడు. విప్లవ విస్తరణ, మిలిటరీ శిక్షణ, ఆయుధాల తయారీ, సాహిత్యం తదితర పనుల కోసం వినయ్‌ని పార్టీ బస్తర్‌కు పంపించింది. 30 ఏళ్లుగా ఆయన బస్తర్‌లో పార్టీని విస్తరించారు. వినయ్ మరణవార్త తెలుసుకొని ఆయన సోదరుడు వెంకటేష్, కుటుంబ సభ్యులు బుధవారం బస్తర్‌కు బయలుదేరారు. గురువారం వినయ్ మృతదేహాన్ని అతడి స్వగ్రామం హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం వంగర గ్రామానికి తరలించే అవకాశాలు ఉన్నట్టు తెలిసింది.

పదిలో 8 మంది గుర్తింపు..

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: నారాయణపూర్ జిల్లాలోని టేక్‌మెటా ఎన్‌కౌంటర్‌లో చనిపోయిన మావోయిస్టుల వివరాలను బస్తర్ పోలీసులు బుధవారం ప్రకటించారు. మొత్తం పది మంది చనిపోగా ఎనిమిది మందిని గుర్తించారు. ఇందులో ముగ్గురు తెలంగాణకు చెందిన వారు ఉన్నారు. మృతుల్లో పెద్దపల్లి జిల్లా రామగుండం మండలం జయ్యారం గ్రామానికి చెందిన చీమల నర్సయ్య ఆలియాస్ జోగన్న ఆలియాస్ జిను(66), కాసరబోయిన వినయ్ (చెన్నూరు, మంచిర్యాల జిల్లా), సుస్మితా అలియాస్ చైతే (వరంగల్), సంగీత అలియాస్ ఆత్రం డోగే (జోగన్న భార్య, అహేరి, గడ్చి రోలి జిల్లా, మహారాష్ట్ర), సురేశ్ (పశ్చిమ బస్తర్), మల్లేశ్ అలియాస్ మడకం ఉంగా (బస్తర్), పొడి యం కోషి (చింతగుప్ప, సుక్మా), కమ్లీ (కిష్టారం, సుక్మా జిల్లా)లు ఉన్నారు. కాగా, జోగన్న ప్రస్తుతం స్పెషల్ జోనల్ కమిటీ మెంబర్‌గా ఉన్నారు. ఇతనిపై 196 క్రిమినల్ కేసులు నమోదు అవగా రూ.25 లక్షల రివార్డు ఉంది.

పర్యావరణ ప్రతిభా అవార్డులకు పీసీబీ దరఖాస్తుల ఆహ్వానం

సనత్‌నగర్ (హైదరాబాద్): ప్రపంచ పర్యావరణ దినోత్సవం (జూన్ 5) సందర్భంగా తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి (టీఎస్‌పీసీబీ) ఆధ్వర్యంలో ప్రతిఏటా అందించే పర్యావరణ ప్రతిభ అవార్డులకు గాను దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. ఈ మేరకు సీనియర్ సామాజిక శాస్త్రవేత్త డాక్టర్ డబ్ల్యూజీ ప్రసన్నకుమార్ బుధవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నియంత్రణ, ఒకసారి వినియోగించి పడేసే ప్లాస్టిక్ నిషేధం, నీటిపొదుపు, వాయు కాలుష్య నియంత్రణ, వ్యర్థ పదార్థాల నిర్వహణ అంశాల్లో విశేష కృషి చేస్తున్న సంస్థలకు ఈ అవార్డులు అందిస్తారని పేర్కొన్నారు. ఆస్పత్రులు, మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్లు, గ్రామపంచాయతీలు, స్వయం సహాయక బృందాలు, పాఠశాలలు, కళాశాలలు, స్వచ్ఛంద సంస్థలు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. తమ దరఖాస్తులను సనత్‌నగర్‌లోని టీఎస్‌పీసీబీ పర్యావరణ విద్యా విభాగంలో ఈ నెల 15 లోపు అందజేయాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం 91773 03127 ఫోన్ నంబర్‌లో సంప్రదించవచ్చన్నారు.

7న బీసీ సంక్షేమ సంఘం విస్తృత స్థాయి సమావేశం

- ఆర్.కృష్ణయ్య వెల్లడి



కాచిగూడ (హైదరాబాద్): లోక్‌సభ ఎన్నికల సందర్భంగా బీసీ సమస్యలపై చర్చించి, ఎన్నికల్లో బీసీలు అనుసరించాల్సిన విధానాలపై తగిన నిర్ణయాలు తీసుకోవడానికి మే 7వ తేదీన కాచిగూడలోని అభినందన్ గ్రాండ్‌లో జాతీయ స్థాయి విస్తృత స్థాయి సమావేశం నిర్వహి స్తున్నట్లు జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య ప్రకటించారు. ప్రజాస్వామ్య దేశంలో స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి పాలక పార్టీలు బీసీలకు ప్రభుత్వంలో వాటా ఇవ్వకుండా కేవలం ఓటు వేసే వ్యక్తులుగానే చూశాయని బుధవారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బీసీలంటే బిచ్చగాళ్లు కాదని, వాటాదారులని పాలక పార్టీలకు తెలిసివచ్చేలా దేశవ్యాప్తంగా బీసీ ఉద్యమాన్ని మరింత ఉధృతంగా చేపట్టనున్నట్లు తెలిపారు. బీసీల వాటా బీసీలకు ఇవ్వకపోతే దేశంలో తిరుగుబాటు తప్పదని ఆయన హెచ్చరించారు. బీజేపీలో ఉన్న బీసీ నేతలు కేంద్ర ప్రభుత్వంపై, పార్టీ జాతీయ నాయకత్వంపై ఒత్తిడి తెచ్చి బీసీల న్యాయమైన డిమాండ్లు పరిష్కార మయ్యేలా చూడాలని ఆర్.కృష్ణయ్య కోరారు.

ఆ ఈవీఎంల వినియోగానికి హైకోర్టు ఓకే

- మేడ్చల్ అసెంబ్లీ ఎన్నికల ఈవీఎంలు.. లోక్‌సభ ఎన్నికల్లో వాడుకునేందుకు ఈసీకి అనుమతి
- మల్లారెడ్డి ఎన్నికను సవాల్ చేస్తూ వజ్రేష్‌యాదవ్ పిటిషన్
- విచారణ చేపట్టిన హైకోర్టు.. ప్రతివాదులకు నోటీసులు




సాక్షి, హైదరాబాద్: మేడ్చల్ అసెంబ్లీ ఎన్నికలకు వినియోగించిన ఈవీఎంలు, వీవీప్యాట్లు పార్లమెంట్ ఎన్నికల్లో వాడుకునేందుకు ఎన్నికల కమిషన్‌కు హైకోర్టు అనుమతి ఇచ్చింది. అలాగే మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి ఎన్నికను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌లో ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను జూన్ 6కు వాయిదా వేసింది. 2023 నవంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ తరఫున మల్లారెడ్డి, కాంగ్రెస్ తరఫున వజ్రేష్‌యాదవ్ పోటీ చేశారు. 33 వేల మెజారిటీతో మల్లారెడ్డి విజయం సాధించారు. అయితే అఫిడవిట్‌లో మల్లారెడ్డి తప్పుడు సమాచారం ఇచ్చారని.. నిర్దేశిత ఫార్మాట్‌లో వివరాలన్నీ ఇవ్వలేదని ఆయన ఎన్నికను రద్దు చేయాలని కోరుతూ వజ్రేష్ యాదవ్ హైకోర్టులో ఎన్నికల పిటిషన్ దాఖలు చేశారు. సమీప అభ్యర్థి అయిన తనను ఎమ్మెల్యేగా ప్రకటించేలా ఎన్నికల కమిషన్‌కు ఆదేశాలు ఇవ్వాలని కోరారు. వజ్రేష్ తరఫున న్యాయవాది సిద్ధ పోగుల దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ జె.శ్రీనివాస్‌రావు బుధవారం విచారణ చేపట్టారు. ఎన్నికల కమిషన్, మేడ్చల్ ఆర్డీవో, అసెంబ్లీ కార్యదర్శి, మల్లారెడ్డితో పాటు ఇతర ప్రతివాదులకు నోటీసులు జారీ చేశారు. అయితే కేసు కారణంగా గోడౌన్‌లో భద్రపరిచిన ఈవీఎంలు, వీవీప్యాట్లను వాడుకునేందుకు అనుమతి ఇవ్వాలని ఈసీ మధ్యంతర పిటిషన్ దాఖలు చేయగా, అందుకు న్యాయమూర్తి అంగీకరించారు.

పల్లా రాజేశ్వర్‌రెడ్డికి నోటీసులు

జనగామ అసెంబ్లీ నుంచి ఎమ్మెల్యేగా పల్లా రాజేశ్వర్‌రెడ్డి (బీఆర్ఎస్) ఎన్నికను సవాల్ చేస్తూ కొమ్మూరి ప్రతాపరెడ్డి(కాంగ్రెస్) హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. సమీప ప్రత్యర్థినైన తనను శాసనసభ్యుడిగా ప్రకటించేలా ఎన్నికల కమిషన్‌కు ఆదేశాలు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ పిటిషన్‌పై కూడా న్యాయమూర్తి జస్టిస్ జె.శ్రీనివాస్‌రావు బుధవారం విచారణ చేపట్టారు. వాదన తర్వాత.. రాజేశ్వర్‌రెడ్డి సహా ఇతర ప్రతివాదులకు న్యాయమూర్తి నోటీసులు జారీ చేస్తూ, విచారణను జూన్ 14కు వాయిదా వేశారు.

దిశ కేసులో పోలీసులకు ఊరట

సిర్పుర్కర్ కమిషన్ నివేదిక ఆధారంగా చర్యలపై హైకోర్టు స్టే



సాక్షి, హైదరాబాద్: దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన దిశ అత్యాచారం, హత్యకు సంబంధించి నిందితుల ఎన్‌కౌంటర్ కేసులో పోలీసు అధికారులకు హైకోర్టులో ఊరట లభించింది. సుప్రీంకోర్టు ఏర్పాటు చేసిన సిర్పుర్కర్ కమిషన్ ఇచ్చిన నివేదిక ఆధారంగా ఇప్పుడే ఎలాంటి చర్యలు చేపట్టవద్దని ఆదేశించింది. తాము తదుపరి ఆదేశాలు జారీ చేసే వరకు స్టే ఉత్తర్వులు అమల్లో ఉంటాయని స్పష్టం చేస్తూ, విచారణను జూలై 10కి వాయిదా వేసింది.

ఆ నివేదిక సరిగా లేదంటూ హైకోర్టును ఆశ్రయించిన పోలీసులు

2019లో దిశ అత్యాచారం, హత్య కేసు దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన విషయం విదితమే. ఈ కేసులోని నిందితులను కొద్ది రోజులకే పోలీసులు ఎన్‌కౌంటర్ చేశారు. ఎన్‌కౌంటర్‌పై ఆరోపణలు రావడంతో ఈ ఘటనపై విచారణ జరిపేందుకు సుప్రీంకోర్టు సిర్పుర్కర్ కమిషన్‌ను నియమించింది. దిశ నిందితులను ఎన్‌కౌంటర్ చేసిన పోలీసు అధికారులపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కమిషన్ 2022లో అందజేసిన నివేదికలో సూచించింది. పోలీసు అధికారులపై హత్యానేరం కింద కేసులు నమోదు చేసి విచారణ జరపాలని పేర్కొంది. అయితే దిశ నిందితుల ఎన్‌కౌంటర్‌కు సంబంధించి సిర్పుర్కర్ కమిషన్ ఇచ్చిన నివేదిక సరిగా లేదని, దాని ఆధారంగా తమపై చర్యలు తీసుకోకుండా ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ ఇన్‌స్పెక్టర్ సుధీర్‌కుమార్ సహా పలువురు పోలీసులు, ఫరూక్‌నగర్ ఇంచార్జి ఎమ్మార్వో పాండు హైకోర్టును ఆశ్రయించారు.

అప్పటివరకు చర్యలొద్దన్న హైకోర్టు

ఈ పిటిషన్లపై జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి బుధవారం విచారణ చేపట్టారు. సీనియర్ న్యాయవాదులు వేణుగోపాల్, రచనారెడ్డి, హేమేంద్రనాథ్ పిటిషనర్ల తరఫున వాదనలు వినిపించారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. తదుపరి విచారణ వరకు అధికారులపై ఎలాంటి చర్యలు చేపట్టవద్దని ఆదేశిస్తూ, విచారణ వాయిదా వేశారు. కాగా, 'దిశ' ఎన్‌కౌంటర్‌కు సంబంధించి పలుప్రజాప్రయోజన వ్యాజ్యాలు, రిట్ పిటిషన్లు ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనం వద్ద పెండింగ్‌లో ఉన్న విషయం తెలిసిందే.

జిల్లా వార్తలు

వనాల పరిరక్షణ.. వన్యప్రాణుల సంరక్షణ!

ఎండలు మండుతున్న తరుణంలో అడవుల అభివృద్ధి, వన్య ప్రాణుల సంరక్షణపై అటవీశాఖ అధికారులు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నారు. వాగులు, వంకలు ఎండిపోతుండడంతో వన్యప్రాణులు దప్పిక తీర్చుకునేందుకు పంటపొలాలు, జనావాసాల వైపునకు వచ్చి ప్రాణాల మీదకు తెచుకుంటున్నాయి. ఈ పరిస్థితులను అధిగమించి వన్యప్రాణుల దాహార్తిని తీర్చేందుకు అటవీ ప్రాంతంలో సాసర్ పిట్లను ఏర్పాటు చేశారు. ట్యాంకర్ల ద్వారా ప్రతీ రెండు వారాలకోసారి నీటిని నింపుతున్నారు. అలాగే అడవులకు పూర్వవైభవం తీసుకురావాలనే ఉద్దేశంతో ప్లాంటేషన్‌ను ముమ్మరం చేశారు.

– బూర్గంపాడు/జూలూరుపాడు

- అడవులు, వన్యప్రాణుల సంరక్షణకు ప్రాధాన్యత
- దాహార్తి తీర్చేందుకు సాసర్ పిట్లు ఏర్పాటు
- రెండు వారాలకోసారి నీటిని నింపుతున్న అటవీశాఖ
- అగ్ని ప్రమాదాల నియంత్రణకు చర్యలు
- వన్యప్రాణులకు తప్పని వేటగాళ్ల బెడద



జూలూరుపాడు: సాసర్ పిట్‌లో నీళ్లు పడుతున్న అటవీ సిబ్బంది

దాహార్తి తీర్చేందుకు..

అశ్వాపురం ఫారెస్ట్ రేంజ్ పరిధిలో అటవీశాఖ అధికారులు, సిబ్బంది 70కి పైగా సాసర్ పిట్లను ఏర్పాటు చేశారు. ప్రతీ పదిహేను రోజులకోసారి బేస్ క్యాంప్ సిబ్బంది, అటవీశాఖ సిబ్బంది ట్యాంకర్లతో నీటిని తరలించి సాసర్లను నింపుతున్నారు. అంతేకాక జల సంరక్షణ కోసం అటవీశాఖ నిర్మించిన చెక్ డ్యామ్‌లు, నీటి కుంటలు కూడా వన్యప్రాణుల దాహార్తిని తీరుస్తున్నాయి. అలాగే జూలూరుపాడు అటవీ రేంజ్ పరిధిలో జూలూరుపాడు, గుండెపుడి, రాజారావుపేట, పాపకొల్లు అటవీ సెక్షన్ల పరిధి లోని రాజుపాలెం, సురారం, గుండెపుడి, నల్లబండబోడు, రాజారావుపేట, వినోభానగర్, పాపకొల్లు–ఏ, పాపకొల్లు–బీ, బేతాళపాడుల్లో మొత్తం 9 బీట్లలో 10 నీటి కుంటలు, 6 చెక్ డ్యాంలు, 10 చెక్ వాల్స్, 10 సాసర్ పిట్లు, 3 సోలార్ బోర్లు ఉన్నాయి. సురారం, పాపకొల్లు బీట్స్‌లో సోలార్ బోర్లు, పంపులు నిర్మించారు.

పొంచి ఉన్న వేటగాళ్ల ముప్పు..

వేసవిలో దప్పిక తీర్చుకునేందుకు వాగులు, వంకలకు వచ్చే వన్యప్రాణులకు వేటగాళ్లు ఉచ్చులు బెడద తప్పడం లేదు. పంట పొలాల సమీపాన విద్యుత్ తీగలు అమర్చి వేటాడుతున్నారు. అటవీశాఖ అధికారులు ఎంత పటిష్టమైన నిఘా పెట్టిన గుట్టు చప్పుడు కాకుండా అడవి జంతువులను వేటాడుతున్నారు. ఈ నేపథ్యాన అడవి జంతువులు పంటచేల వైపు రాకుండా, వాగులు వైపు రాకుండా అటవీ ప్రాంతంలో ఏర్పాటు చేసిన సాసర్ పిట్లు, చెక్‌డ్యామ్‌లు చేయగలగడంతో వేటగాళ్ల బెడద తగ్గుతుంది. అశ్వాపురం ఫారెస్ట్ రేంజ్ పరిధిలో ఎక్కువగా అడవి పందులు, జింకలు, దుప్పులు, మనుబోతులు, కొండ గొర్రెలు, కుందేళ్లు వంటి వన్యప్రాణులు, వివిధ రకాల పక్షులు, సర్పాలు, కీటకాలున్నాయి. వీటిని కాపాడుకునేందుకు పాపకొల్లు, సురారం బీట్‌లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. అలాగే, జూలూరుపాడు అటవీ రేంజ్ పరిధిలో కనకగిరి, చీమలపాడు రిజర్వ్ ఫారెస్ట్‌లో చిరుతలు(ప్యాంతర్లు), ఎలుగుబంట్లు, దుప్పులు, చుక్కల జింకలు, అడవి పందులు, ముళ్ల పందులు, నక్కలు, తోడేళ్లు, మనుబోతులు, కనుజులు, కోతులు, కొండముచ్చులు, పలురకాల సర్పాలు ఉన్నాయి. వీటి సంరక్షణకు పాపకొల్లు, సురారం బీట్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు అటవీశాఖ అధికారులు చెబుతున్నారు.

ఆవాసాలకు అనువుగా ప్లాంటేషన్..

వన్యప్రాణుల ఆవాసాలకు అనువుగా, ఆహారం కోసం సహజసిద్ధమైన అడవులను పెంచేందుకు అటవీశాఖ చర్యలు చేపట్టింది. అంతేకాక అటవీ భూముల ఆక్రమణలపై ప్రత్యేక దృష్టి సారించి కఠిన చర్యలు చేపడుతుంది. ఈనేపథ్యాన ఫారెస్ట్ నర్సరీలలో తునికి, విప్ప, పాల, చింత వంటి అటవీ ఫలాలనిచ్చే మొక్కలు నాటుతున్నారు. ఈక్రమంలో జూలూరుపాడు అటవీ రేంజ్ పరిధిలో 2021–2022 సంవత్సరంలో 81హెక్టార్ల విస్తీర్ణం(202.5 ఎకరాలు)లో గల పోడు భూముల్లో ప్లాంటేషన్ చేపట్టారు. 2022–2023 సంవత్సరంలో 50 హెక్టార్లు ప్లాంటేషన్ చేయగా.. ఇందులో నల్లబండబోడులో 12 హెక్టార్లు, సురారంలో 12 హెక్టార్లు, వినోభానగర్‌లో 26 హెక్టార్లలో ప్లాంటేషన్ విస్తరించి ఉంది. చీమలపాడు రిజర్వ్ ఫారెస్ట్ పాపకొల్లు–ఏ, పాపకొల్లు–బీ, రాజరావుపేట బీట్లలో అడవి జంతువుల మేత కోసం 100 హెక్టార్ల విస్తీర్ణంలో గ్రాస్ ల్యాండ్ పెంచారు. గ్రాస్ ల్యాండ్‌లో గడ్డి జాతులు 35 రకాలు పెంచుతున్నారు. వినోభానగర్, జూలూరుపాడు అటవీ నర్సరీల్లో పెంచుతున్న మొక్కల చుట్టూ ట్రెంచ్(కందకం) ఏర్పాటు చేసి సంరక్షిస్తున్నారు.

అగ్ని ప్రమాదాల నివారణకు ఫైర్‌లైన్స్..



వేసవిలో ఎండ తీవ్రత అధికంగా ఉండడంలో అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ఈ నేపథ్యాన అడవులు తగలబడకుండా ఉండేందుకు ఫైర్‌లైన్స్ ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా ఈ ఏడాది జూలూరుపాడు అటవీ రేంజ్ పరిధిలో కనకగిరి, చీమలపాడు రిజర్వ్ ఫారెస్ట్‌లో 25 కిలోమీటర్ల దూరం 5 మీటర్ల వెడల్పులో ఫైర్‌లైన్స్ ఏర్పాటు చేశారు. అంతేకాక అగ్ని ప్రమాదాల నివారణకు ఫైర్ వాచర్లను నియమించారు. వీరు ఎప్పటికప్పుడు పరిస్థితులను గమనిస్తూ.. ఏదైనా అగ్ని ప్రమాదం జరిగితే అటవీశాఖాధికారులకు సమాచారం ఇవ్వడంతో పాటు అడవి తగలబడకుండా తగు చర్యలు తీసుకుంటున్నారు.

చర్యలు తీసుకుంటున్నాం..

వేసవిలో వన్యప్రాణుల దాహార్తి తీర్చేందుకు చర్యలు తీసుకుంటున్నాం. అశ్వాపురం ఫారెస్ట్ రేంజ్ పరిధిలో సహజ సిద్ధంగా నీరు లభించే ప్రాంతాలున్నాయి. నీరు అందుబాటులో లేనటువంటి 70 చోట్ల సాసర్ పిట్స్‌లో ట్యాంకర్లతో నీటిని నింపుతున్నాం. ఒక్కో సాసర్ పిట్‌కు కిలోమీటర్ దూరం ఉండేలా నిర్మాణాలు చేపట్టి నీటి కొరత లేకుండా చూస్తున్నాం.

– రమేష్, ఎఫ్ఆర్ఓ, అశ్వాపురం

అడవులను రక్షించాలి..

అడవులు ఆక్రమణ గురికాకుండా తగు చర్యలు తీసుకుంటున్నాం. అలాగే అగ్ని ప్రమాదాలకు గురికాకుండా ఫైర్‌లైన్స్ ఏర్పాటు చేశాం. అటవీ సిబ్బంది అప్రమత్తతో ఉంటున్నారు. వన్యప్రాణుల దాహార్తి తీర్చేందుకు ప్రతీ రెండు వారాలకోసారి సాసర్ పిట్స్‌లో నీటిని నింపుతున్నాం. ప్రస్తుతం చెక్ డ్యాంలు, చెక్ వాల్స్, నీటి కుంటల్లో నీళ్లు ఉన్నాయి.

– జి.ప్రసాద్‌రావు, ఎఫ్ఆర్ఓ, జూలూరుపాడు

వనమా ఇంటికి కేసీఆర్



వనమా కుటుంబ సభ్యులతో మాజీ సీఎం కేసీఆర్

పాల్వంచ : మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు బుధవారం పాత పాల్వంచలోని మాజీ ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు ఇంటికి వచ్చారు. ఈ సందర్భంగా వనమా, కుటుంబసభ్యులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. అనంతరం కేసీఆర్‌కు భద్రాద్రి రామయ్య ప్రసాదం, పట్టువస్త్రాలను బహూకరించారు. కాగా, ఎన్నికల అనంతరం కుటుంబ సమేతంగా హైదరాబాద్‌లోని తన ఇంటికి భోజనానికి రావాలని వనమా కుటుంబ సభ్యులను ఆహ్వానించారు. ఎన్నికల్లో చురుకుగా పని చేయాలని వనమా రాఘవేందర్‌రావుకు సూచించారు. మహబూబాబాద్ పార్లమెంట్ అభ్యర్థి మాలోతు కవిత, ఎమ్మెల్సీ తాతా మధు, మాజీ ఎంపీ సంతోష్, వనమా రామకృష్ణ, ముత్యాల వీరభద్రం, ప్రవీణ్, కొత్వాల సత్యనారాయణ, మంతపురి రాజుగౌడ్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

పొదెం వాహనం తనిఖీ

కరకగూడెం: భద్రాద్రి డీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే పొదెం వీరయ్య వాహనాన్ని పినపాక మండలం ఏడూళ్ల బయ్యారం క్రాస్ రోడ్ వద్ద పోలీసులు బుధవారం తనిఖీ చేశారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పినపాక, కరకగూడెం మండలాల్లో పోలీసుల ముమ్మరంగా వాహన తనిఖీలు చేపడుతున్న క్రమంలో పొదెం వీరయ్య అటుగా రావడంతో ఆయన వాహనాన్ని ఎస్ఎస్ టీ టీమ్ అధికారి కొమరం లక్ష్మణ్ రావ్, పోలీస్ సిబ్బంది తనిఖీ చేశారు.

జీఎం కార్యాలయానికి మోక్షమెప్పుడో?!

- సత్తుపల్లిలో రెండేళ్లుగా సాగుతున్న నిర్మాణం
- సింగరేణి కార్మికులు, నిర్వాసితులకు తప్పని దూరాభారం
- బొగ్గు ఉత్పత్తిలో తలమానికంగా నిలుస్తున్నా నిర్లక్ష్యమే..



నిర్మాణంలో ఉన్న సింగరేణి జీఎం కార్యాలయం

సత్తుపల్లి: సింగరేణి పరిధిలోని కొత్తగూడెం ఏరియాకు చెందిన సత్తుపల్లిలోని ఓసీల నుంచి బొగ్గు ఉత్పత్తి గణనీయంగా నమోదవుతోంది. స్థూల బొగ్గు ఉత్పత్తిలో సత్తుపల్లి వాటా తాజాగా ముగిసిన ఆర్థిక సంవత్సరంలో 13.8 వాటాగా నమోదైంది. కొత్తగూడెం ఏరియాలోని సత్తుపల్లి పరిధి జేవీఆర్ ఓసీ, కిష్టారం ఓసీల్లో లక్ష్యానికి మించి బొగ్గు ఉత్పత్తి జరుగుతోంది. 2023–24 సంవత్సరంలో జేవీఆర్ ఓసీలో 100 లక్షల టన్నుల గాను 110 లక్షల టన్నులు, కిష్టారం ఓసీలో 24 లక్షల టన్నులకు 24 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి నమోదు కాగా.. రైలు, రోడ్డు మార్గాల్లో భారీగా బొగ్గు రవాణా అవుతోంది. అయినప్పటికీ ఇక్కడ జీఎం కార్యాలయ నిర్మాణం ఏళ్లుగా సాగుతుండడంతో కార్మికులు, నిర్వాసితులు ప్రతీ పనికి కొత్తగూడెం వెళ్లాల్సి రావడం ఇబ్బందిగా మారుతోం.

కొత్తగూడెం వెళ్లాల్సిందే..

సత్తుపల్లిలో జీఎం కార్యాలయం లేకపోవడంతో ప్రతీ చిన్న పనికి కార్మికులు కొత్తగూడెంకు వెళ్లాల్సి వస్తోంది. జేవీఆర్ ఓసీ, కిష్టారం ఓసీల్లో 1,200 మంది కార్మికులు, 75 మంది కార్యాలయ సిబ్బంది, కాంట్రాక్టు కార్మికులు సుమారు వెయ్యి మంది వరకు పని చేస్తున్నారు. కార్మికులకు సంబంధించిన ఎటువంటి ఉత్తర ప్రత్యుత్తరాలు కావాలన్నా 60 కి.మీ. దూరంలో ఉన్న కొత్తగూడెం వెళ్లి రావాల్సి ఉండడంతో ఒక రోజంతా వృథా అవుతోందని, ఆ రోజు సెలవు పెట్టాల్సి వస్తుందని కార్మికులు వాపోతున్నారు. ఇకపోతే భూ నిర్వాసితుల సమస్యలను విన్నవించుకునేందుకు వ్యయప్రయాసాలకోర్చి వెళ్లాల్సి వస్తుందని, ఆ రోజు అధికారులు కలవకపోతే పని జరగడం లేదని వాపోతున్నారు.

అగ్రస్థానంలో ఉన్నా..

కొత్తగూడెం ఏరియాలోనే బొగ్గు ఉత్పత్తి, రవాణాలో సత్తుపల్లి ప్రథమ స్థానంలో నిలుస్తోంది. అయినా జీఎం కార్యాలయం నిర్మాణంలో అలసత్వంపై కార్మిక సంఘాల నాయకులు మండిపడుతున్నారు. భవిష్యత్‌లో సత్తుపల్లి కేంద్రంగానే బొగ్గు ఉత్పత్తి ఉంటుందని.. కార్మికులకు సంక్షేమం, పాలనాపరంగా పనుల కోసం ఇక్కడ జీఎం కార్యాలయాన్ని త్వరగా అందుబాటులోకి రావాల్సిన అవసరముందని కార్మికులు అంటున్నారు. సత్తుపల్లిలో జీఎం క్యాంప్ ఉన్నా సిబ్బంది అందుబాటులో ఉండకపోవటంతో సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి జీఎం కార్యాలయ నిర్మాణ పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

రెండేళ్లుగా సా..గుతున్న పనులు

సత్తుపల్లి ఏరియాలో జీఎం కార్యాలయం నిర్మించాలన్న కార్మికులు, నిర్వాసితుల డిమాండ్‌తో రెండేళ్ల క్రితం కార్యాలయ నిర్మాణానికి అట్టహాసంగా శంకుస్థాపన చేశారు. ఏడాదిలోనే పూర్తి చేసి కార్మికులకు అందుబాటులోకి తీసుకొస్తామని అప్పట్లో అధికారులు ప్రకటించారు. కానీ రెండేళ్లు దాటినా కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా మొదటి అంతస్తు నిర్మాణం స్లాబ్ వరకు వచ్చింది. ప్రస్తుత పరిస్థితులు పరిశీలిస్తే భవన నిర్మాణం పూర్తికావడానికి ఇంకా ఏడాది పట్టే అవకాశముందని చెబుతున్నారు.

ఒక్కొక్కరికి రెండేసి క్వార్టర్లు!

- సింగరేణి కొత్తగూడెం ఏరియాలో 40 మంది గుర్తింపు
- నోటీసులు ఇవ్వనున్న అధికారులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి అధికారుల తప్పిదాలు కార్మికుల పాలిట శాపాలుగా మారుతున్నాయి. ఒక కార్మికుడికి ఒకే క్వార్టర్ నిబంధన కొత్తగూడెం ఏరియాలో అమలు కావడం లేదు. ఈ ఏరియాలో సుమారు 40మంది కార్మికులు రెండేసి క్వార్టర్లు తీసుకోవడం పర్సనల్ విభాగం అధికారుల పనితీరుకు అద్దం పడుతోంది. సంస్థ పరిధిలో 39 వేల మంది కార్మికులు ఉంటే 56 వేల క్వార్టర్లు ఉన్నా కొందరికి దక్కడం లేదు. కొందరు అక్రమంగా రెండేసి క్వార్టర్లు తీసుకుని ఒక దాంట్లో నివాసముంటూ ఇంకొకటి అద్దెకు ఇచ్చి కంపెనీ నల్లా, విద్యుత్ వినియోగించుకున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. కార్పొరేట్ కార్యాలయం కొనసాగుతున్న కొత్తగూడెం ఏరియాలో ఇలా ఉందంటే మిగతా ఏరియాల్లో ఏం జరుగుతోందో అర్థం కాని పరిస్థితి నెలకొంది. ఇప్పటికే కొన్ని క్వార్టర్లను ఇతర సెక్షన్ల వారు ఆక్రమించుకుంటుండగా, వారిని ఎలా బయటికి పంపించాలా అనే ఆలోచనలో అధికారులు నిమగ్నమయ్యారు. ఇంతలో సంస్థ కార్మికులే రెండేసి క్వార్టర్లు తీసుకున్నట్లు బయటపడడం గమనార్హం.

ఎందుకు ఇలా..

సింగరేణిలో సిబ్బందికి క్వార్టర్ల కేటాయింపునకు సంబంధించి ఆన్‌లైన్ విధానం అందుబాటులో లేదు. దీంతో కొత్తగూడెం ఏరియాలో విధులు నిర్వర్తిస్తున్న కొందరికి ఇతర ఏరియాలకు బదిలీ అయినా అక్కడ క్వార్టర్ తీసుకుంటూ ఇక్కడ ఖాళీ చేయడం లేదు. ఇతర ప్రాంతాల నుంచి కొత్తగూడెం ఏరియాకు వచ్చిన వారు సైతం తమ పాత స్థానంలో క్వార్టర్‌ను వదలకుండా అద్దెకు ఇస్తున్నట్లు సమాచారం. ఈ క్రమంలోనే సంస్థ యాజమాన్యం ఆన్‌లైన్ విధానాన్ని ప్రవేశపెట్టగా 40 మంది వరకు రెండేసి క్వార్టర్లు అనుభవిస్తున్నట్లు తేలింది. దీంతో వారికి నోటీసులు జారీ చేసి క్వార్టర్ తీసుకున్న సమయం నాటి నుంచి స్థానిక పరిస్థితుల ఆధారంగా రెండు, మూడు రెట్ల అద్దె(పీనల్ రెంట్) వసూలు చేయాలని నిర్ణయించారు.

శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం..

సంస్థ ఉద్యోగులు, కార్మికులకు సర్వీసులో ఉన్నంత కాలం క్వార్టర్ సౌకర్యం ఉంటుంది. కానీ కొందరు రెండేసి క్వార్టర్లు పొందటం ఇతరుల హక్కులను హరించడమే. రెండు క్వార్టర్లు తీసుకున్నట్లు తేలిన వారి నుంచి పీనల్ రెంట్ రికవరీ చేసి, కాక శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం.

–శాలేంరాజు, కొత్తగూడెం ఏరియా జీఎం